

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL


GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 120 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 బుధవారం 16 జూలై 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్



1959 - 2024

దివంగత షఫీఉల్లా ఖాన్

మాజీ మేనేజింగ్ ఎడిటర్

## తెలంగాణకు అన్యాయం జరగదు

### బనకచర్లపై వాదనలు గట్టిగా వినిపించాలి

### కేంద్ర హోంమంత్రి బండి సంజయ్

**కరీంనగర్,జూలై15(సమయజ్యోతి):**



తెలంగాణకు కేందప్రభుత్వం ఎప్పుడూ అన్యాయం చేయదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఉద్ఘాటించారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో మన తెలంగాణ వాదాన్నిసీఎం రేవంత్‌రెడ్డి గట్టిగా వినిపించాలని కోరారు. కేంద్రానికి రెండు రాష్ట్రాలు సమానమేనని నొక్కిచెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వివరించాలని సూచించారు. మంగళవారం కరీంనర్‌లో బండి సంజయ్ పర్యటించారు. పలు కార్యక్రమాల్లో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం చేసే అన్యాయాన్ని బీసీ సంఘాలు ఎందుకు ప్రశ్నించడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన సమగ్ర సర్వేలో బీసీలు 51 శాతం.. కాంగ్రెస్ సర్వేలో మాత్రం 46 శాతమా అని ప్రశ్నించారు. బీసీల్లో ముస్లింలను కలపడం ఏంటని నిలదీశారు. బీసీలకు మిరిచ్చేది కేవలం ఐదు శాతమేనని చెప్పుకొచ్చారు. బీసీ ఆర్డినెన్స్‌ను తాము వ్యతిరేకించమని స్పష్టం చేశారు. బీసీల్లో ముస్లింలను కలిపితే ఆ ఆర్డినెన్స్‌ను మాత్రం అడ్డుకుంటామని హెచ్చరించారు. బీసీలను రేవంత్ ప్రభుత్వం మోసం చేస్తోందని.. ఈ మోసంపై బీసీ సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీసీల్లో ముస్లింలను కలిపితే.. కేందప్రభుత్వం ఆమోదం తెలపదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.



## బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్

### 43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి

### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి):**

ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చాయి. దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచాన్ని కోవిడ్ భయపెడుతున్న సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లు తయారు చేశాం. ప్రపంచ దేశాలకు సరఫరా చేయగలిగామని సీఎం అన్నారు. శామీర్‌పేట జీనోమ్‌వ్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మంగళవారం ఐకార్ బయోలజిక్స్ కొత్త యూనిట్ కు సిఎం శంకుస్థాపన చేశారు. మిగతా 2లో





## భారత్‌లో అడుగుపెట్టిన టెస్లా

### ముంబైలో తొలి షోరూమ్ ప్రారంభం ప్రారంభోత్సవ

### కార్యక్రమంలో పాల్గొన్న సిఎం ఫడ్నవీస్

**ముంబై,జూలై15 (సమయజ్యోతి):**



టెస్లీ కార్లు ఇక భారత రోడ్లపై పరుగెట్టనున్నాయి. ఎంతోకాలంగా అభిమానులు ఎదురు చూస్తున్న ఘడియ వచ్చింది. అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ముంబయిలో తొలి షోరూంను మంగళవారం ప్రారంభించింది. బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని మార్కర్ మ్యాక్సిటీ మాల్‌లో దానిని తెరిచింది. ఈ షోరూం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ హాజరయ్యారు. భారత్‌లో తొలిగా ముంబైలో అడుగుపెట్టిన ఈ సంస్థకు ఘనంగా స్వాగతం చెప్పారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడుతూ టెస్లా సరైన రాష్ట్రం, నగరాన్ని ఎంచుకుంది. ఈ కంపెనీ కార్ల డిజైన్, ఇన్నోవేషన్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఉంటుంది. మిగతా 2లో

## మంత్రి జూపల్లిని కలిసిన నిథమ్ డైరెక్టర్

**హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి):**

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ- మేనేజ్‌మెంట్ నిథమ్ డైరెక్టర్‌గా నియమితులైన ప్రొఫెసర్ వెంకట రమణ. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట రమణకు మంత్రి జూపల్లి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.



## నల్గొండను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలపాలి

### ఫార్మసీ,లా కాలేజీల ఏర్పాటు చిరకాల కోరిక మహాత్మాగాంధీ వర్సిటీ

### ప్రతిష్టను పెంచాలి నల్లగొండ విద్యారంగ అభివృద్ధిపై మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి):**

నల్గొండను అన్ని రంగాల్లో నంబర్ వన్ గా నిలపాలనేది నా ప్రధాన ధ్యేయం అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. నల్గొండలో ఫార్మసీ కాలేజీ,లా కాలేజీ ఏర్పాటు- చేయాలనేది తన చిరకాల కోరిక అన్నారు.ముఖ్యమంత్రి సహకారంతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తేవడానికి ప్రయత్నిస్తున్నాం అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నల్గొండ అభివృద్ధి పై మంత్రి కోమటి రెడ్డి సమీక్ష నిర్వహించారు. నల్గొండను అన్ని రంగాల్లో నంబర్ వన్ గా నిలపాలనేదే తన ప్రధాన ధ్యేయమని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. మిగతా 2లో



## ముగిసిన శుభాంశు శుక్లా రోదసీయాత్ర

### క్షేమంగా భూమ్మీదకు చేరుకున్న భారత

### వ్యోమగామి ప్రధాని మోడీ తదితరుల శుభాకాంక్షలు

**కాలిఫోర్నియా,జూలై15(సమయజ్యోతి):**

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసీయాత్ర ముసిగింది. ఆయన తిరగి క్షేమంగా భూమ్మీదకు చేరుకున్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్ష పరిశోధన కేంద్రం ఐఎస్ఎస్‌కి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తిరిగి భూమిపైకి చేరుకున్నారు.



## గగన్‌యాన్‌కు శుభాంశు శుక్లా అనుభవం జోడింపు

### - ఇస్రో సంస్థ వెల్లడి

**న్యూఢిల్లీ,జూలై15(సమయజ్యోతి):**

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఐఎస్ఎస్ వెళ్లి క్షేమంగా తిరిగి వచ్చారు. 18 రోజుల పాటు ఆయన అంతరిక్షంలో గడిపారు. దీనిపై భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో స్పందించింది. ఐఎస్-ఎస్‌లో ఉన్న సమయంలో శుక్లా సొంతం చేసుకున్న అనుభవం గగన్‌యాన్ మిషన్‌కు ఎంతో కీలకం కానుందని ఇస్రో స్పేస్ అప్లికేషన్ సెంటర్ డైరెక్టర్ నీలేశ్ ఎం దేశాయ్ అభిప్రాయపడ్డారు. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ.. ఈ యాత్ర విజయంతో రోదసిరంగంలో భారత్ శాశ్వత స్థానాన్ని ఏర్పరచుకుంది. ఇది యావత్ ప్రపంచానికి గర్వకారణం. మిగతా 2లో



# మెదక్ జిల్లా కాంగ్రెస్ నేత హత్య

## అనుమానాస్పద మృతిపై పోలీసుల దర్యాప్తు

**మెదక్,జూలై15(సమయజ్యోతి):**

మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతరకు చెందిన కాంగ్రెస్ యువనేత మారెల్లి అనిల్ (35) అనుమానాస్పద రీతిలో మృతిచెందాడు. అతని కుడి భుజం నుంచి రెండు బుల్లెట్లు- దూసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అయితే ప్రత్యర్థులు ఆయనను కాల్చి చంపినట్లు తెలుస్తోంది. రియల్ వ్యవహారంలో ఈ ఘటనజరిగిందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శవపరీక్ష కోసం అనిల్ మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న అనిల్ తొలుత రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు- ప్రకటించారు. పెట్రోలు బంక్ నిర్వహిస్తున్న అనిల్.. సోమవారం రాత్రి మెదక్ నుంచి స్వగ్రామానికి కారులో బయల్దేరాడు. ఇదే మండలం చిన్నఘనపూర్ విద్యుత్తు ఉపకేంద్రం వద్ద కారు అదుపు తప్పి కల్వర్టుకు వాహనం ఢీకొట్టింది. దీంతో కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. అనిల్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడున్న వారు గమనించి మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. అయితే పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించగా బుల్లెట్ల విషయం వెలుగులోకి వచ్చింది. ప్రత్యర్థులు కారు ఆపి తుపాకీతో కాల్చినట్లు ప్రచారం సాగుతోంది.

# వాణిజ్య పన్నుల శాఖలో ముగ్గురి బదిలీ

## అక్కడే తిష్టవేయడంతో ప్రభుత్వం చర్యలు

**హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి):**

వాణిజ్య పన్నులశాఖలో ముగ్గురు అదనపు కమిషనర్లపై రాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. చాలాకాలంగా డివిజన్లు వదిలి వెళ్లని వీరు అధికారులను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అదనపు కమిషనర్లుగా పదోన్నతులు పొందినా డివిజన్లు వదిలి వెళ్లడానికి ఈ ముగ్గురు ఒప్పుకోవట్లేదని వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో వీరిపై బదిలీ వేటు పడింది. సికింద్రాబాద్ నుంచి వాసవీ జగన్నాథం, అబిడ్స్ నుంచి లావణ్య, మాదాపూర్ నుంచి గీతకు స్థానభ్రంశం కల్పించింది. వారి స్థానాల్లో ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న జాయింట్ కమిషనర్లకు పోస్టింగ్‌లు ఇస్తూ వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అబిడ్స్ అదనపు కమిషనర్ లావణ్య.. అధికారులను వేధింపులకు గురి చేస్తున్నట్లు- ఫిర్యాదు అందింది. ఈ వ్యవహారంపై మీడియాలో వచ్చిన కథనాలపై ప్రభుత్వం స్పందించింది. మంగళవారం ఉదయం నుంచి లావణ్యపై వచ్చిన ఫిర్యాదులు, స్పందించిన వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ హరిత.. అబిడ్స్ డివిజన్‌లో చోటు- చేసుకున్న వ్యవహారంపై ఆరా తీసారు. మరోవైపు వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. దీంతో ఖాళీగా ఉన్న పోస్టులకు బదిలీ చేశారు.

# గోదావరిఖనిలో ఇద్దరు మావోల లొంగుబాటు

**పెద్దపల్లి,జూలై15(సమయజ్యోతి):**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఇద్దరు నేతలు పోలీసులకు లొంగిపోయారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఈ వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఒకరు తెలంగాణ రాష్ట్ర కమిటీ- సభ్యుడు ఆత్రం లచ్చన్న అలియాస్ గోపన్న కాగా, మరొకరు బస్తర్ ఏరియా కమిటీ- కార్యదర్శిగా పనిచేసిన చౌదరి అంకుభాయ్. వీరిద్దరూ గత 30 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొంటూ అజ్ఞాత జీవితం గడిపారు. ముఖ్యంగా లచ్చన్న మంచిర్యాల జిల్లా చెన్నూరు సమీపంలోని పారుపల్లి గ్రామానికి చెందినవారు.పార్టీ లోపలున్న అనేక విభేదాలు, ఆరోగ్య సమస్యలు, వయస్సు పెరుగుతున్న కొద్దీ ఒడిదుడుకుల జీవితాన్ని కొనసాగించడం కష్టంగా మారటంతో ఈ నేతలు రహస్య అజెండాను విడిచి ప్రభుత్వానికి లొంగిపోయినట్లు- తెలుస్తోంది. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. పోలీస్ శాఖ తరఫున లచ్చన్నకు రూ.20 లక్షలు, అంకుభాయ్‌కు రూ.5 లక్షలు నగదుగా బహుమతిగా అందజేశారు. వీరి లొంగింపు మావోయిస్టు ఉద్యమానికి మరో తీవ్రమైన దెబ్బగా భావిస్తున్నారు. లొంగిపోయినవారికి ప్రభుత్వం పునరావాసం, భద్రతతో పాటు- జీవనోపాధి కల్పనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు- చేస్తుందని అధికారులు పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే ప్రభుత్వ విధానాల ప్రకారం ఈ దంపతుల పునర్వాస ప్రక్రియ చేపడతామని తెలిపారు. ఈ లొంగింపు ఘటనతో మావోయిస్టు ఉద్యమ బలహీనపడుతున్న సంకేతాలే తెలుస్తున్నాయి. అటు- పోలీసుల వ్యూహాత్మక చర్యలు, ఇటు- ప్రభుత్వ పునరావాస పథకాలు ప్రభావితం చేస్తున్నట్లు- నిపుణుల అభిప్రాయం.

# డెంటిస్ట్ ప్రత్యూష ఆత్మహత్య కేసు

## భర్తతో పాటు కుటుంబ సభ్యుల అరెస్ట్

**హన్మకొండ,జూలై15(సమయజ్యోతి):**

డెంటిస్ట్ ప్రత్యూష ఆత్మహత్య కేసులో ఆమె భర్త సృజన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులైన ప్రత్యూష భర్త సృజన్, ఆయన తల్లిదండ్రులు, సృజన్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు వివరాలను ఏసీపీ పి.ప్రశాంత్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌తో వివాహేతర సంబంధాన్ని వదిలిపెట్టబోనని భర్త తేల్చిచెప్పడంతోనే డెంటిస్ట్ ప్రత్యూష ఆత్మహత్యకు పాల్పడినట్లు- కాజీపేట పోలీసులు తెలిపారు. ప్రత్యూష-సృజన్ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. వీరి కుటుంబం హసన్‌పర్తిలోని కాకతీయ వింటేజ్ విల్లాస్‌లో స్థిరపడింది. కొన్నాళ్ల క్రితం ఓ ప్రైవేటు- ఆస్పత్రి పబ్లిసిటీ- కోసం యాజమాన్యం సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌ను పిలిపించారు. ఆమెతో సృజన్‌కు ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. అప్పటి నుంచి కుటుంబాన్ని పట్టించుకోని సృజన్.. భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. ఇన్‌ఫ్లూయెన్సర్‌ను వదిలిపెట్టలేనని తేల్చి చెప్పాడు. భర్తతోపాటు అత్తమామలు, ఇన్‌ఫ్లూయెన్సర్ వేధింపులకు గురిచేస్తున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సిట్ పిలుపు

**హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి):**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కేసులో విచారణకు హాజరు కావాలని ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నను సిట్ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. 17వ తేదీన జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయానికి రావాలని ఆయనకు ఆ నోటీసుల్లో సూచించారు. మరో వైపు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావును మంగళవారం సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. అందులోభాగంగా దాదాపు 8 .30 గంటల పాటు- ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయనకు పలు ప్రశ్నలు సంధించి.. పలు కీలక విషయాలు రాబట్టినట్లు- తెలుస్తుంది.??ఇప్పటికే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో పలువురు పోలీస్ ఉన్నతాధికారులను సిట్ అధికారులు విచారించారు. ప్రభాకర్ రావు ఆదేశాలతో తాము ఇదంతా చేశామని సిట్ అధికారుల ఎదుట వారంతా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభాకర్ రావు అమెరికా వెళ్లి పోయారు. దీంతో విదేశాల నుంచి ఆయన్ని రప్పించేందుకు సిట్ అధికారులు కోర్టును ఆశ్రయించారు. ఆ క్రమంలో ప్రభాకర్ రావు సైతం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో సుప్రీంకోర్టు కూడా ప్రభాకర్‌ను అరెస్ట్ చేయవద్దంటూ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అందులో భాగంగా ప్రభుత్వానికి గడువు సైతం విధించింది. అయితే తమ విచారణలో ప్రభాకర్ రావు నోరు విప్పక పోవడంతో.. సుప్రీంకోర్టుకు వెళ్లాలనే భావనలో సిట్ అధికారులు ఉన్నట్లు- తెలుస్తుంది. ప్రభాకర్ రావు వద్ద నుంచి మరిన్ని వివరాలు రాబట్టాలనే కోణంలో సిట్ అధికారులు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు.

# బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలోనే 33 శాతం వ్యాక్సిన్స్ , బల్క్ డ్రగ్స్‌లో 43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని నొక్కిచెప్పారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచే ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్‌ను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలదని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు.ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుందని ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 3లక్షల 28 వేల కోట్లు పెట్టుబడులు సాధించామని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలతో పోటీ- పడాలని, అధునాతన విధానాలను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని నొక్కిచెప్పారు. ఇందుకు జీనోమ్ వ్యాలీ పారిశ్రామికవేత్తల సహకారం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జీనోమ్‌వ్యాలీ ఆసియా ఖండంలోనే ప్రత్యేకమైందిగా గుర్తింపు పొందిదన్నారు. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్‌లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

# నల్గొండను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలపాలి

మొదటిపేజీ తరువాయి

మూడు దశాబ్దాలుగా ఉమ్మడి నల్గొండ ప్రజలు తనను ఆశీర్వదిస్తూ వస్తున్నారని,వారి ఉన్నతి కోసం ఎంత చేసిన తక్కువే అని మంత్రి పేర్కొన్నారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధి,మహాత్మా గాంధీ యూనివర్సిటీ-,కాలేజీ,స్కూల్ ఎడ్యుకేషన్ పై ఆ శాఖ ఉన్నతాధికారుతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయమని దాని ఖ్యాతిని పెంచేలా వీసీ,రిజిస్ట్రార్ ,పాలక సభ్యులు పనిచేయాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. యూనివర్శిటీకి ప్రత్యేకంగా 60.22 కోట్ల గ్రాంట్ మంజూరు చేశామని,ఇన్ఫ్రా డెవలప్మెంట్ చేస్తున్నందున కొత్త కోర్సుల పై ఆరా తీశారు. విశ్వవిద్యాలయంలో కొత్తగా ఫార్మసీ,ఎల్ ఎల్ బి,ఎల్ ఎల్ ఎం లాంటి కోర్సులు ప్రారంభించేందుకు చొరవ చూపాలని వీసీ అల్తాఫ్ హుస్సేన్ మంత్రిని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి సహకారంతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తేవడానికి అన్ని విధాల ప్రయత్నిస్తు న్నామని అందుకే ఇంత బిజీ షెడ్యూల్లో కూడా విద్యా శాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్షకు వచ్చారన్నారు. నల్గొండలో యూనివర్సిటీ- కాలేజ్ ఆఫ్ ఫార్మసి,లా కాలేజీ ఏర్పాటు- చేయాలనేది నా చిరకాల కోరికనీ అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టామని త్వరలో నూతన కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కాలేజ్,స్కూల్ ఎడ్యుకేషన్ కు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.డిగ్రీ,జూనియర్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలు..హై స్కూల్స్ బలోపేతంపై చర్చించి,అందుకు విద్యాశాఖ అధికారులు అందించాల్సిన సహకారం పై పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి ప్రభుత్వ కాలేజీలు,స్కూల్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిపై చర్చిస్తానని చెప్పారు. ఈ సమీక్షలో విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా,సాంకేతిక,ఉన్నత విద్యా మండలి కమిషనర్ దేవసేన,మహాత్మగాంధీ యూనివర్సిటీ- వీసీ అల్తాఫ్ హుస్సేన్,రిజిస్ట్రార్ రవి తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో అడుగుపెట్టిన టెస్లా

మొదటిపేజీ తరువాయి

2015లో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు తొలిసారి టెస్లా కారులో తిరిగానని ఫడణవీస్ అన్నారు. టెస్లా దీర్ఘకాలిక ప్రణాళికల గురించి ఎన్నో ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ.. ప్రస్తుతానికి స్థానికంగా దీని తయారీపై ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.భారత్‌లో ఈ ఎలక్ట్రిక్ కార్ల తయారీకి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికలపై ఆశాభావం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా 'మోడల్ వై' కారును సంస్థ ఆవిష్కరించింది. తొలుత 'మోడల్ వై' ఈవీలను -టె-స్లా భారత్ మార్కెట్లో విక్రయించనుంది. ఇక్కడ ఆర్‌డబ్ల్యూడీ వెర్షన్ (బేస్) 'మోడల్ వై' ఆన్‌రోడ్ ధర రూ.61.07 లక్షలుగా నిర్ణయించింది. లాంగ్‌రేంజ్ వెర్షన్ ధర రూ.69.15లక్షలుగా ఉంది. బేస్ మోడల్ ధర అమెరికాలో 44,990 డాలర్లు (రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్లు (రూ.31.57లక్షలు) జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09లక్షలు)గా ఉంది. దిగుమతి సుంకాలు, రవాణా ఖర్చుల కారణంగా భారత్‌లో దీని ధర ఎక్కువగా ఉంది. కొన్నిరోజుల క్రితం భారత రోడ్లపై 'మోడల్ వై' ను పరీక్షించిన సంగతి తెలిసిందే. ముంబయి-పుణే జాతీయరహదారిపై ఈ వాహనం దర్శనమివ్వడం చూపరులను ఆకర్షించింది. ఇది పూర్తిగా అప్‌డేట్ అయిన మోడల్ కారుగా నిపుణులు గుర్తించారు. దీని కోడ్‌నేమ్ జునిపెర్. అడ్వాన్స్‌డు వర్షన్‌ను అమెరికా, కెనడా మార్కెట్లలో వీటిని విక్రయిస్తున్నారు. దీని సీ షేప్‌లోని ఎల్ఈడీ లైట్లు-, ట్విన్ స్పోక్ అలాయ్ వీల్స్, -టె-స్లా ప్రత్యేకతను తెలిపే గ్లాస్ రూఫ్ ఉన్నాయి. ఇది భారత్‌లో ఆరు రంగుల్లో లభించవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మోడల్ వై కారు ఆల్‌వీల్ డ్రైవ్‌గా లభిస్తోంది. వీటిల్లో లాంగ్ రేంజ్ బ్యాటరీ ప్రత్యేకత. ఒక్కసారి ఛార్జి చేస్తే 500-600 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. కేవలం 4.6 సెకన్లలో గంటకు 0-96 కిలోమీటర్ల వేగాన్ని అందుకొంటుంది. అత్యధికంగా గంటకు 200 కి.మీ. వేగంతో ప్రయాణించగలదు. దీనిలో భారీ 15.4 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను అమర్చారు. వెనక సీట్లలోని ప్యాసింజర్ల కోసం 8 అంగుళాల ప్రత్యేకమైన స్క్రీన్ కూడా ఉంటు-ంది. అడాస్ ఫీచర్లు, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్ వంటి హంగులు ఇందులో కస్టమర్లకు లభించనున్నాయి.

# ఉప్పాడ తీర ప్రాంత కోత నివారణకు శాశ్వత పరిష్కారం

## రూ. 323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్రం

## పచ్చజెండా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి

**సమయజ్యోతి జులై 15:**

కాకినాడ పార్లమెంటు పరిధి, పిఠాపురం నియోజకవర్గంలో ఉప్పాడ తీర ప్రాంతం కోత నివారణకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుందని, రూ. 323 కోట్ల వ్యయంతో శాశ్వత ప్రతిపాదికన రక్షణ గోడ నిర్మించేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసినట్లు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సముద్ర అలల కారణంగా ఉప్పాడ తీర ప్రాంతం క్రమేపి క్షీణించిపోతుందన్నారు, మూడు దశాబ్దాలుగా ప్రతి యేటా సగటున 1.23 మీటర్లు మేర కోతకు గురవుతుందగా, ఒక్క 2017-18 ఏడాదిలోనే 26.3 మీటర్లు కోతకు గురైందన్నారు. దీనివల్ల తీరప్రాంత గ్రామాలైన ఉప్పాడ,నేమం, అమీనాబాద్, సుబ్బంపేట, కొమరగిరి తదితర మత్స్యకార గ్రామాల ప్రజల జీవనోపాధిపై తీవ్రంగా ప్రభావం చూపుతుందన్నారు. దీంతోపాటు కోత కారణంగా రోడ్లు ధ్వంసమై రాకపోకలు స్తంభించిపోతున్నాయని తెలిపారు. తీర ప్రాంత కోత నివారణకు శాశ్వత పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలతో కేంద్ర హోంశాఖ ప్రతినిధులను కలిసి చర్చించడంతో పాటు ఈ ఏడాది మార్చి 17న నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ కి లేఖ రాయడం జరిగిందన్నారు. కోత వల్ల ఎదురవుతున్న నష్టాలను లేఖలో సుదీర్ఘంగా వివరించడంతో పాటు, రక్షణ గోడ నిర్మాణానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ కి అందజేసిన ప్రాజెక్ట్ రిపోర్ట్ ను తక్షణం ఆమోదించాలని కోరడం జరిగిందన్నారు. దీనిపై స్పందించిన కేంద్రం ప్రతిపాదనలను చెన్నైలోని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ కు పంపించగా రూ. 323 కోట్ల వ్యయంతో టెట్రాపాడ్ ల ఆధారంగా శాశ్వత రక్షణ గోడ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. ఈ ప్రతిపాదనలు ఆమోదించేందుకు ఈనెల 30న ఢిల్లీలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి అధ్యక్షతన సబ్ కమిటీ సమావేశం కానుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.



# రైల్వే సమస్యలపై జిఎంతో ఎంపీ పురందేశ్వరి భేటీ

రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కలిసి, నియోజక వర్గ పరిధిలోని రైలు అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. రైల్వే అధికారులు, అలాగే రైల్వే యూనియన్ నాయకుడు ఉన్నికృష్ణన్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కొవ్వూరు మున్సిపాలిటీ బిజెపి కౌన్సిలర్ పిఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు. రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషన్ అభివృద్ధికి 271 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి ఆరు మాసాలు కావస్తున్నా, ఇంకా టెండర్లు పిలవలేదని జీఎం దృష్టికి ఎంపీ పురందేశ్వరి తీసుకొచ్చారు. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని 2027లో గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రెండు మూడు రోజుల్లో టెండర్లు పిలిచి, మొదటి దశ పనులు వెంటనే ప్రారంభిస్తామని జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ చెప్పారు. గోదావరి స్టేషన్, కొవ్వూరు స్టేషన్లలో టాయ్ లెట్స్, వంటి సౌకర్యాలు మెరుగుపరచాలని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పుష్కరాలలోగానే పనులు పూర్తిచేయాలని ఎంపీ పురందేశ్వరి కోరారు. కరోనాకు ముందువరకు కొవ్వూరులో 18రైళ్లు ఆగేవని, ఇప్పుడు 8రైళ్లు మాత్రమే ఆగుతున్నాయని, ముఖ్యంగా చెన్నై, తిరుపతి వెళ్ళడానికి కూడా రైళ్లు ఆగడం లేదని, సింహాద్రి ఎక్స్ ప్రెస్ కూడా ఆపడం లేదని ఎంపీ పురందేశ్వరి ప్రస్తావించారు. ప్రజలకు ఉపయోగపడే ముఖ్యమైన తిరుమల, సర్కారు, సింహాద్రి ఎక్స్ ప్రెస్ వంటి రైళ్లన్నీ ఆగేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కరోనా ముందు రాజమండ్రి నుంచి తణుకు, భీమవరం, నరసాపురం వరకు ప్యాసింజర్ రైళ్లు ఉండేవని, కరోనా సమయంలో వీటిని ఆపేశారని, వాటిని పునరుద్ధరించాలని ఎంపీ పురందేశ్వరి కోరారు. కరోనా తర్వాత పునరుద్ధరించాలని చూసినప్పటికీ రాజమండ్రి నాల్గవ ఫ్లాట్ ఫారం పనుల కారణంగా నిడదవోలు నుంచి వెళుతున్నాయని అయితే రాజమండ్రి నుంచి యథావిధిగా మూడు ప్యాసింజర్ రైళ్లు పునరుద్ధరించాలని కోరారు.

# శాంతి భద్రతల పరిరక్షణ నిబంధనలు..

## అతిక్రమిస్తే చర్యలు: సిపి సాయి చైతన్య ఆదేశాలు

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో

శాంతి భద్రతల పరిరక్షణకు నిబంధనలను ఎవరైన అతిక్రమిస్తే సంబంధిత చట్టాల ప్రకారం తగు చర్యలు తీసుకోవడానికి నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లోని పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు / ఎస్.ఐ లకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, అధికార ఉత్తర్వులను జారీచేశారు. ఈ ఉత్తర్వులు తేది16 నుండి 31-07-2025 వరకు అమలులో ఉంటాయని, ప్రజలందరూ సంబంధిత పోలీస్ అధికారులకు సహకరించగలరని కోరారు.ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్టించరాదు, ముఖ్యంగా జనరద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేపట్టరాదు. విగ్రహాల ఏర్పాటుకు కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా పొందవలసి ఉంటుంది. ఎక్కువ శబ్దంతో డి.జే లను ఏర్పాటుచేయరాదని, ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. రెసిడెన్షియల్ స్థలంలో, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలి. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డి.జే ల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేదం గలదు. పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలి. ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డి. జేలు. సౌండ్ సిస్టంలు నిజామాబాద్ కమిషనరేటు పరిధిలో నిషేదం గలదు. ఎవరైనా సభలు,



సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుండి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహించాలని భావిస్తే సంబంధిత అసిస్టెంటు పోలీస్ కమిషనర్ అనుమతి తప్పనిసరి 500 మంది కంటే ఎక్కువ జనాలతో కూడిన కార్యక్రమనికి 72 గంటల ముందుగా పోలీస్ కమిషనర్ అనుమతి తీసుకోవాలి. మాల్స్, సినిమా ధియేటర్స్, హెూటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం సెక్యూరిటి నిబంధనలు తప్పనిసరి పాటించాలి. ప్రతీ ఒక్కరు క్యూ పద్ధతిని తప్పనిసరి పాటించాలి. డ్రోన్ల వాడకం వలన ఎక్కువ ప్రమాదాలు పొంచి ఉన్న నేపధ్యంలో నియంత్రణ చర్యలు తీసుకోవడం జరగుతుందని, ఈ డ్రోన్ల ఉపయోగం వలన జనజీవనానికి విఘాతం కలగడమే కాకుండా శాంతి భద్రతలకి విఘాతం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఎవరయినా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రారంభించదలచినచో ముందస్తుగా సంబంధిత ప్రభుత్వ సంస్థలు, పోలీసు మరియు ఏవియేషన్ అధికారుల నుండి క్లియరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పాస్ పోర్టు, వీసా, రవాణా, టూరిస్ట్ తదితర సేవలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి చాలా మంది గల్ఫ్ ఏజెంట్లు అనదికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తూ, అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. కావున జిల్లా ప్రజలు గల్ఫ్ ఏజెంట్లకు తమ ఇల్లు అద్దెకు ఇచ్చే ముందుజాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అటువంటి వారు అద్దెకు వస్తే ముందస్తుగా వారి సమాచారాన్ని, ఎవరైనా అనుమానస్పదంగా కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. నిజామాబాద్ జిల్లాలో " ఎ " (పెద్దలు) సర్టిఫికేట్ పొందిన సినిమాలను మైనర్లు చూడటానికి ధియేటర్లను అను మతించరాదు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులు నిజామాబాద్ వీదుల్లో చట్టాన్ని గౌరవించే పౌరుల పట్ల ముఖ్యంగా మహిళలు మరియు పిల్లల పట్ల అసభ్యకరమైన వికృత, అసభ్యకరమైన ప్రవర్తన ను ప్రదర్శిస్తున్నట్లు నివేధికలు సూచిస్తున్నాయి. సాధారణంగా రోడ్డు వినియోగదారులకు, ముఖ్యంగా మహిళలు మరియు పిల్లలకు చికాకు, ఆటంకము కలిగించి ప్రజా ప్రశాంతతకు దారితీస్తుంది. కావున బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీచేశారు.

### 42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు ఇస్తే బీసీలకు

# తీవ్ర అన్యాయం

### 12 శాతమున్న ముస్లిలంకు వంద శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారా?

### కేంద్ర హెూమ్ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

బీసీల రిజర్వేషన్ల అమలుపై కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు పేరుతో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం దుర్మార్గమన్నారు. ముస్లింలను బీసీ రిజర్వేషన్ల జాబితా నుండి తొలగించక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. తక్షణమే బీసీ జాబితా నుండి ముస్లింలను తొలగించి 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకే దక్కేలా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 51 శాతమున్న బీసీలకు 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం 12 శాతమున్న ముస్లింలకు మాత్రం వందకు వంద శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు సిద్ధమవడం దుర్మార్గమన్నారు. బనకచర్ల విషయంలో కేంద్రం రెండు రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయడాన్ని స్వాగతించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ వాదనను బలంగా విన్పించాలని కోరారు. ఈరోజు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన బండి సంజయ్ కుమార్, పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే టెన్త్ విద్యార్థులందరికీ సైకిళ్లను అందజేస్తున్నాం. 20 వేలకుపైగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నం. బనకచర్ల ప్రాజెక్టు అంశంపై కేంద్ర ప్రభుత్వం రేపు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం కాబోతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ వాదనను బలంగా విన్పించాలని కోరుతున్నా. కేంద్రానికి అన్ని రాష్ట్రాలూ సమానమే. ఏ రాష్ట్రానికి అన్యాయం చేయదు. ఇప్పటికే కేంద్రం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగకుండా సమిష్టిగా క్రుషి చేద్దాం. ఈ విషయంలో



రాష్ట్ర వాదనను సీఎంల మీటింగ్ లో రేవంత్ రెడ్డి గట్టిగా విన్పించాలి.

బీసీ రిజర్వేషన్ల అమలు వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. ప్రభుత్వం వాస్తవాలను కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తోంది. అవాస్తవాలను మీడియా ద్వారా ప్రజలకు చేరవేస్తోంది. కొన్ని బీసీ సంఘాలు ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ బీసీలకు అన్యాయం చేస్తున్నాయి. వైఎస్ హయాంలో ముస్లింలను బీసీల్లో చేర్చి 4 శాతం రిజర్వేషన్లను అమలు చేసింది. ఆ టైంలోనే బీసీ సంఘాలు అడ్డుకుని ఉంటే బీసీలకు అన్యాయం జరిగేది కాదు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇస్తేనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలకు తీవ్రమైన అన్యాయం జరిగింది. ఇప్పుడు 10 శాతం ఇస్తామంటున్నారు. ఇది దారుణం.వాస్తవానికి బీసీ జనాభా రాష్ట్రంలో 51 శాతం ఉంది. సమగ్ర కుటుంబ సర్వేలోనే ఈ విషయాన్ని తేల్చారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన పేరుతో బీసీల జనాభాను 46 శాతానికి తగ్గించారు. అంటే బీసీల సంఖ్యను 5 శాతం తగ్గించేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెబుతూ అందులో 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు అమలు చేస్తున్నారు. తద్వారా బీసీలకు దక్కే రిజర్వేషన్లు 32 శాతమే. మోదీ ప్రభుత్వం ఇప్పటికే బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అదనంగా ఇస్తున్న రిజర్వేషన్లు 5 శాతమే. దీనివల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. అట్లాగే ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అందులో ముస్లింలు లబ్ది పొందుతున్నారు. రాష్ట్రంలో 12 శాతం మంది ముస్లింలు ఉంటే... కాంగ్రెస్ 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా ముస్లింలకు ఇకపై వందకు వంద శాతం రిజర్వేషన్లు పొందబోతున్నారు. బీసీలకు మాత్రం తీవ్రమైన అన్యాయం జరగబోతోంది. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం. అయినా ఆర్డినెన్స్ తీసుకువస్తామని చెప్పడం దుర్మార్గం. ముస్లింలకు వందకు వందశాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నప్పుడు బీసీ జనాభా దామాషా ప్రకారం బీసీ వర్గాలకు ఎందుకు రిజర్వేషన్లు ఎందుకు కల్పించరు? తక్షణమే బీసీ రిజర్వేషన్ల జాబితా నుండి ముస్లింలను తొలగించాలి. 42కు 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు అమలు చేస్తానంటే కేంద్రాన్ని ఒప్పించి ఆమోదం తెలిపే బాధ్యతను మేం తీసుకుంటాం. లేనిపక్షంలో ఊరుకునే ప్రసక్తే లేదు. బీసీ సంఘాల నాయకులారా... మీ దురాలోచనను, మీ రాజకీయాలను పక్కనపెట్టి బీసీలకు జరుగుతున్న అన్యాయంపై మాట్లాడాలని కోరుతున్నా. గుండెపై చేయి వేసుకుని వాస్తవాలు మాట్లాడాలని కోరుతున్నా. కాంగ్రెస్ కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముస్లింలను బీసీ జాబితా నుండి తొలగించి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, పార్టీ శ్రేణులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుకాణానికి అగ్నిప్రమాదం..

### మంటలను అదుపులోకి

### తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ పట్టణంలో గత సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతాన శాంభవి ట్రేడ్స్ లో అగ్ని ప్రమాద ఘటన చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది శకటంతో తరలి వచ్చి, ఇరుగు పొరుగు ప్రాంతాలకు మంటలు వ్యాప్తి చెందకుండా అదుపులో కి తెచ్చి, మంటలను పూర్తిగా ఆర్పి వేశారు. ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. ఇంచార్జ్ ఫైర్ ఆఫీసర్ బి.శేఖర్, ఈ.రంజిత్ (ఎఎల్ఎఫ్), కె.రాజశేఖర్ (డ్రైవర్ ఆపరేట్), కె.హనుమాన్ చారి (ఫైర్ మాన్) పాల్గొన్నారు.



## బాల్కొండ లో హార్డ్వేర్ షాప్ లో అగ్ని ప్రమాదం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలోని శాంభవి హార్డ్వేర్ షాప్ లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఏసీ తో పాటు కంప్యూటర్లు, రెండు టీవీలు, లాప్టాప్ లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు 6 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు రవీన్ ప్రసాద్ వాపోయారు. ఎస్సై శైలేందర్ సంఘటన స్థలాన్ని సందర్శించారు.



## సినారె సాహిత్య పురస్కారానికి డా.దామెర రాములు ఎంపిక

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో జూలై 15.

మహాకవి సి. నారాయణ రెడ్డి (సినారె) జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం ప్రకటించిన అవార్డుకు నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ వైద్యుడు, కవి మరియు రచయిత డాక్టర్ దామెర రాములు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాల ఆధారంగా తెలంగాణ రాష్ట్ర స్థాయి (సినారె) సాహిత్య పురస్కారంకు కవులు మరియు రచయితలను ఎంపిక చేసినట్లు వారు తమ పత్రికా ప్రకటనలో తెలిపారు. జూలై 27, 2025న యాదాద్రి భువనగిరిలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులు ఇవ్వబడతాయి.ఈ ప్రకటన తర్వాత చాలా మంది కవులు, రచయితలు, కళాకారులు మరియు ఇతరులు డాక్టర్ దామెర రాములును అభినందించారు,ఈ జాబితాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి డాక్టర్ దామెర రాములుకు స్థానం లభించిందని వారు తెలిపారు.



## కేజీబీవీ లకు మౌలిక వసతులు మెరుగుపర్చాలి

### కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశం

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో జూలై 15

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశం కలెక్టర్ మాట్లాడుతూ, కేజీబీవీ విద్యాలయాల్లో నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పైకప్పుల లీకేజీలు, మరమ్మత్తులు, అదనపు మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు తదితర అంశాలపై తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులు నివేదిక అందజేయాలని సూచించారు. అవసరమైన చోట ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పనులు చేపట్టాలని, దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్నారు.అనంతరం వైద్యాధికారులతో సమీక్షించిన కలెక్టర్, మండలాలలోని పిహెచ్సీలకు అనుబంధంగా సబ్ సెంటర్ల నిర్మాణంపై ప్రణాళిక రూపొందించాలన్నారు. నిర్మాణంలో ఉన్న సబ్ సెంటర్ల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, డీఈఓ రామారావు, డీఎం %డ% హెచ్ఓ డా.రాజేందర్, కేజీబీవీ సమన్వయకర్త సలోమి కరుణ, తహసీల్దార్లు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమయజ్యోతి
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# స్థానిక ఎన్నికల సమరం !

బిసి రిజర్వేసన్లు, స్థానిక ఎన్నికల చుట్టూ ఇప్పుడు తెలంగాణ రాజకీయం కేంద్రీకృతం అయ్యింది. ఈ వ్యవహారంలో అధికార కాంగ్రెస్ రెండాకులు ఎక్కువే చదివింది. రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని కులగణన చేపట్టిన, బిసి రిజర్వేషన్లకు ఆర్డినెన్స్ ప్రతిపాదించింది. బిసిల ఉద్యమాన్ని నెత్తికెత్తుకునే క్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఎందుకంటే పదేళ్లు అధికారంలో ఉండగా ఏనాడు కనిపించని నిఆదం కాంగ్రెస్ రాగానే అందుకుంటే ఫలితం ఇవ్వలేదు. ఇది కేవలం రాజకీయ ఎత్తుగడగా ప్రజలకుకూడా అర్థం అయ్యింది. మొత్తంగా ఇప్పుడు బిసి రిజర్వేషన్ల పేటెంట్ కాంగ్రెస దక్కించుకుంది. దీనిని ప్రధాన ఎజెండగా చేసుకుని అడుగులు వేస్తోంది. విపక్ష పార్టీలకు సవాళ్లు విసురుతోంది. అయితే స్థానిక ఎన్నికల్లో ఈ రిజర్వేషన్ల అమలు అంత సులువు కాదు. సెప్టెంబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అటు రిజర్వేషన్ల అమలు లో వేగం పెంచింది. ఇటీవలే కేబినేట్‌లో ఆర్డనెన్స్ తెచ్చేందుకు ఆమోదించింది. కొత్తగా రేషన్ కార్డులు జారీ ప్రక్రియను వేగం చేసింది. అలాగే సన్నబియ్యం, రైతుభరోసా వంటి కార్యక్రమాలు చేసింది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేబినెట్ తీర్మానం చేయడంతో అందరి దృష్టి స్థానిక సంస్థలపై పడింది. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి సంవత్సరన్నరపైగా కావడం, పరిషత్‌ల గడువు ముగిసి సంవత్సరం పూర్తవుతుండటంతో ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే సందేహాలు అందరిలో నెలకొన్నాయి. ప్రస్తుతం స్థానిక సంస్థలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉండి, నిధులు రాక అభివృద్ధి కుంటుపడింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చింది. అందులో భాగంగానే రిజర్వేషన్లు 50 శాతానికి లోబడి ఉండాలనే కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఆలస్యమవుతూ వచ్చింది. అయితే తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇస్తుండటం తో ఇప్పుడు అదే పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం అవలంబించాలని భావిస్తోంది. ప్రస్తుతం అందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారవుతున్నట్లు తెలుస్తుండగా, రేపో.. మాపో ఆర్డినెన్స్ వచ్చే అవకాశం ఉంది. హైకోర్టు ఇప్పటికే ఎన్నికలను పూర్తి చేయడానికి మూడు నెలల గడువు ఇవ్వగా.. ఆ లోపే పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ప్రస్తుతానికి పంచాయతీలకంటే ముందు పరిషత్ ఎన్నికలే నిర్వహిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. మరి రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. ఇప్పటికే ఓటర్ జాబితా సిద్ధం కాగా.. కావాల్సిన బ్యాలెట్ బాక్సులు, సామగ్రి, ప్రింటింగ్ కూడా అధికారులు పూర్తిచేసి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండగా.. మెజారిటీ స్థానాలను ఆ పార్టీనే దక్కించుకుంది. ఇకపోతే బీసీ రిజర్వేషన్ల విషయంలో తన నిబద్ధతను ప్రశ్నించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదని అధికార కాంగ్రెస్ ఇప్పటికే ఎదురుదాడి ప్రారంభించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసమే ఇంత కాలం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేశామని అంటున్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎవరైనా కోర్టుకు వెళ్తే.. వాదించడానికి ఢిల్లీ నుంచి ఉద్ధండులైన న్యాయవాదులను నియమిస్తామని సిఎం రేవంత్ ఇప్పటికే ప్రకటించారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కాగితం పెట్టిన వాళ్లని, పెట్టించిన వాళ్లని సామాజిక బహిష్కరణ చేస్తామని ప్రకటించాలని బీసీ నేతలకు పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపైన కాంగ్రెస్ ఎంపీలతోపాటు ఇండియా కూటమి ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని, అన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్లు అమలైతేనే నిజమైన విజయమని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లే ప్రధాన ఎజెండా కావాలని ఆకాంక్షించారు. అంటే మొత్తంగా మెజార్టీ ప్రజలను తమ బుట్టలో వేసుకోవడానికి కాంగ్రెస్ ఎత్తుగడలు వేసిందనే చెప్పాలి. ఇకపోతే బీసీ రిజర్వేషన్లపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని సీఎం రేవంత్ రెడ్డి సహా పార్టీ నేతలు విమర్శించారు. బీసీ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాల్సింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, ఆర్. కృష్ణయ్య ఈ రిజర్వేషన్లను సాధించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రధాని మోదీ స్థానంలో రాహుల్ గాంధీ ఉండి ఉంటే.. 48 గంటల్లో తాను రిజర్వేషన్ల ను సాధించుకువచ్చేవారమని అంటున్నారు. రిజర్వేషన్ల అంశంపై మోదీని తెలం గాణకు చెందిన బీజేపీ కేంద్ర మంత్రులు ప్రశ్నించాలని, బీజేపీ నాయకులు తమ నిబద్ధతను చాటుకోవాలని సవాళ్లు విసురు తున్నారు. ఓ రకంగా బిజెపిని ఇరుకున పెట్టాలన్న ఎత్తుగడతో ఇదంతా చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచొద్దని పంచాయతీరాజ్ చట్టం చేసిందని కూడా బిఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తున్నారు. కవిత ఆనాడు ఎందుకు ఉద్యమించలేదని నిలదీస్తున్నారు. ఆ చట్టంలో పేర్కొన్న 50 శాతం నిబంధనను సవరిస్తూ తాము ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకువస్తున్నామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తాపత్రయం పడుతున్నది తామేనని అంటున్నారు. వంద ఏండ్ల బీసీల ఆకాంక్షను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చిందని, బీసీ రిజర్వేషన్లు గొప్ప కార్యక్రమమని అభివర్ణించారు. ఆనాడు దళితులు, వెనుకబడిన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు కల్పించిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చారని గుర్తు చేశారు. కులగణన పైన ఎన్నో అవాంతరాలు వచ్చినా వాటిని అధిగమించామని, ఏడాది లో పూర్తి పారదర్శకంగా, పక్కాగా కులగణన పూర్తి చేశామని ప్రకటించారు.

# భూసార పరీక్ష విశ్లేషణ పత్రములను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

వ్యవసాయ శాఖ,ఇఫ్కో వారి ఆధ్వర్యంలో నానో యూరియా ప్లస్,నానో డిఏపి పై అవగాహన సదస్సు,ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో-ఆపరేటివ్ లిమిటెడ్.మంగళవారం నార్నూర్ రైతు వేదిక లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొని భూసార పరిరక్షణ పథకం,భూసార పరీక్ష విశ్లేషణ పత్రములను రైతులకు అందజేశారు.ఈ అవగాహన సదస్సులో జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీధర్ స్వామి,జిల్లా ఉద్యాన వన అధికారి సుధాకర్,వ్యవసాయ కళాశాల అసోసియెట్ శ్రీధర్ చౌహన్,సీనియర్ శాస్తవేత్త డాక్టర్.రాజశేఖర్,సోయిల్ సయిన్స్ ప్రొఫెసర్ ప్రవీశ్ కుమార్,డిఆర్డిఓ రవీందర్,తహసిల్దార్,ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతు రైతులందరు మట్టి పరీక్షలు చేయించుకోవాలని,పరీక్షల అనుసారం ఎరువులు వాడాలని తెలిపారు.త్వరలోనే ప్రతీ గ్రామం లో సాయిల్ హెల్త్ అవేర్నెస్ క్యాంపెయిన్ చెస్తామని,అట్టి కార్డ్ యూస్ ప్రోగ్రాంకు రైతలలు రావాలని కోరారు.సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ అంటే,రైతుల భూమి యొక్క ఆరోగ్య స్థితిని తెలుసుకోవడానికి,నేల పరీక్షలు నిర్వహించి,ప్రతి రైతుకు వ్యక్తికరించిన మట్టి ఆరోగ్య కార్డులను అందించడం.ఈ కార్డులలో నేల యొక్క బలాలు,బలహీనతలు,సూక్ష్మపోషకాల లోపాలు,పంటలకు అవసరమైన ఎరువుల సిఫార్సులు ఉంటాయి.సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ యొక్క ముఖ్య ఉద్దేశాలు భూమి ఆరోగ్య స్థితిని తెలుసుకోవడం,నేల పరీక్షల ద్వారా భూమిలో ఉన్న పోషక పదార్థాల స్థాయిలు,పిహెచ్ విలువ,సేంద్రియ పదార్థాల శాతం వంటి ముఖ్యమైన విషయాలను తెలుసుకోవచ్చన్నారు.వ్యక్తీకరించిన ఎరువుల సిఫార్సులు,నేల ఆరోగ్య కార్డులో పంటలకు అవసరమైన ఎరువుల సిఫార్సులు ఉంటాయని,తద్వారా రైతులు అవసరమైన మొత్తంలో మాత్రమే ఎరువులను ఉపయోగించవచ్చని,ఇది అధిక ఖర్చులను తగ్గిస్తుంది మరియు భూమి ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు.సరైన ఎరువుల వాడకం మరియు భూమి నిర్వహణ ద్వారా పంటల ఉత్పాదకతను పెంచవచ్చునారు.అవసరమైన దానికంటే ఎక్కువ ఎరువులు వాడటం వలన పర్యావరణానికి హాని కలుగుతుంది,సాయిల్ హెల్త్ కార్డుల ద్వారా ఎరువుల వాడకం తగ్గించడం వలన పర్యావరణాన్ని పరిరక్షించవచ్చున్నారు.అధిక



దిగుబడి మరియు ఖర్చులను తగ్గించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడానికి సహాయపడుతుందన్నారు.సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ ప్రక్రియలో 1.మట్టి నమూనా సేకరణ:ప్రభుత్వం గ్రామాలలో మట్టి నమూనాలను సేకరిస్తుంది.,2.నేల పరీక్ష: సేకరించిన నమూనాలను ప్రయోగశాలలలో పరీక్షించి,నేల యొక్క ఆరోగ్య స్థితిని విశ్లేషిస్తారు.,3. సాయిల్ హెల్త్ కార్డుల జారీ: విశ్లేషణ ఆధారంగా,ప్రతి రైతుకు వ్యక్తిగతీకరించిన సాయిల్ హెల్త్ కార్డులను జారీ చేస్తారు.,4.కార్డుల పంపిణీ: జారీ చేసిన కార్డులను సంబంధిత రైతులకు పంపిణీ చేస్తారు.,5.సలహాలు మరియు మార్గదర్శకత్వం: రైతులు సాయిల్ హెల్త్ కార్డులలో ఇచ్చిన సిఫార్సులను అనుసరించి పంటలను సాగు చేయడానికి అవసరమైన సలహాలు మరియు మార్గదర్శకత్వం అందిస్తారని తెలిపారు.

# మాకొద్దీ తెల్లదొరతనమంటూ..నినదించిన కవి జాతీయకవి గరిమెళ్ల సత్యనారాయణ

**శ్రీకాకుళం,జూలై15(సమయజ్యోతి):**

మాకొద్దీ తెల్లదొరమంటూ..' గేయం రాసి పాడి నాటి ఉద్యమకారుల్లో స్ఫూర్తి రగిలించిన మహోన్నత వ్యక్తి గరిమెళ్ల సత్యనారాయణ.. జాతీయ గేయకవిగా ప్రసిద్ధి పొంది తన గీతాల తూటాలతో బ్రిటీష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించడమే కాకుండా వారి ఆగ్రహానికి గురై జైలు జీవితాన్ని అనుభవించిన వ్యక్తి గరిమెళ్ల.. గరిమెళ్ల సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న జన్మించారు. దేశభక్తిపై గరిమెళ్ల రాసిన కవితలు అప్పటి కలెక్టర్ బ్రేకన్ ఆగ్రహానికి గురై జైలుశిక్ష అనుభవించిన వారిలో మొదటి వారు.. జాతీయోద్యమంలో శ్రీకాకుళం జిల్లా కీర్తిని ఇనుమడింపజేసిన జాతీయ గేయకవి, గరిమెళ్ల సత్య నారాయణ స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా ప్రియాగ్రహారం.. 1920 డిసెంబర్‌లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహా సభలో సహాయ నిరాకరణ

తీర్మానంతో స్ఫూర్తి పొంది ఆ వీరావేశంతో ఉద్యమంలోకి గరిమెళ్ల ప్రవేశించారు. 'మా కొద్దీ తెల్లదొరతనమూ.. దేవ' రాసిన గీతానికి జైలుశిక్ష అనుభవించారు. ఆ తరువాత బయటకు వచ్చిన ఆయన ప్రజల్లోకి వెళ్లి బ్రిటీష్ వారికి గడగడలాడించే అనేక గేయాలు రాసి పాడి గంభీరంగా పాడి స్ఫూర్తి రగిలించారు. దీనిని గమ నించిన నాటి బ్రిటీష్ అధికారులు ఆయనకు కాకినాడ మేజి స్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ రెండేళ్ల కారాగార శిక్ష విధించారు. ఆయన జైలులో ఉండ గానే 1923లో తండ్రి వెంకటనరసింహం మృతి చెందారు. క్షమాపణ చెబితే విడిచిపెడతామని అధికారులు పేర్కొన్నా దానిని ధిక్కరించి ఆయన శిక్షను పొందారు. కొద్ది రోజుల్లోనే భార్య మరణించారు. అప్పుల పాలై తన ఆస్తులను కూడా విక్ర యించుకోవాల్సి వచ్చింది. ఎన్నో రచనలు చేయడమే కాకుండా ఆల్ఇండియా రేడియో ప్రసా రానికి రచనలు చేశారు. చివరిదశలో ఆరోగ్యం క్షీణించి దుర్భర జీవితాన్ని అనుభవించి మద్రాసు వీధుల్లో భిక్షాటన చేసు కుంటూ గడిపాడు.. స్వాతంత్ర్యా నంతరం దేశంలో ప్రబలిన అవినీతికి విసిగి వేసారిన గరిమెళ్ల మిత్రుల్లో కొందరు ఆయనను 'మాకొద్దీ నల్లదొరతనము..'



అంటూ కొత్త పాట రాయాల్సిందిగా కోరారు. అయితే, నరనరానా దేశభక్తిని జీర్ణించుకున్న ఆయన అందుకు అంగీకరించలేదు. 1952 డిసెంబరు 18న మృతి చెందారు. స్వాతంత్య సమరంలో చేసిన సేవలకు గుర్తుగా 1993లో స్వగ్రామం ప్రియాగ్రహారంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు.

# వన మహొత్సవంలో అందరూ భాగస్వాములు కావాలి.

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

నార్నూర్ మోడల్ స్కూల్ లో ఏర్పాటు చేసిన డి ఆర్ డి ఓ ఆధ్వర్యం లో మెగా వన మహొత్సవం కార్యక్రమం లో 500 మొక్కలు నాటే సామూహిక కార్యక్రమంలో మంగళవారం ఏకలవ్య స్కూల్ లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా మొక్కలు నాటారు.పచ్చదనాన్ని పెంపొందిస్తూ,భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి,ఆహ్లాదకర పర్యావరణం అందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహొత్సవం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.నార్నూరు మండలం లో విస్తృతంగా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 500 మొక్కలను మోడల్ స్కూల్,ఏకలవ్య స్కూల్ ల ఆవరణలో నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత గురించి ఎవరికి వారు గుర్తిస్తూ,విధిగా మొక్కలు నాటాలని సూచించారు.మొక్కల వల్ల పర్యావరణ సమతుల్యం కాపాడడంతో పాటు పచ్చదనం పెరిగి సకాలంలో వర్షాలు కురుస్తాయని,జీవ కోటికి స్వచ్ఛమైన ప్రాణ వాయువు లభిస్తుందని గుర్తు చేశారు.ఇది మనకే కాకుండా మన భవిష్యత్ తరాలకు కూడా ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మొక్కల పెంపకానికి ప్రాధాన్యతను ఇస్తూ పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తోందన్నారు.ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగానే కాకుండా,మన అవసరాల రీత్యా కూడా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి,వాటి పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ రవిందర్,ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు.



# నేడు బిఆర్ఎస్ పార్టీ నాయకుల విస్తృత స్థాయి సమావేశం

## సమావేశంలో పాల్గొననున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా**

ఉమ్మడి కృష్ణ మరియు మాగనూర్ మండలాల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు శివరాజ్ పాటిల్,మోనేష్ మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. ఈ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిధులుగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి, చిట్టెం సుచరిత రెడ్డి పాల్గొంటున్నారని అన్నారు. ఇట్టి విస్తృత స్థాయి సమావేశాన్ని మండల కేంద్రంలోని ముడుమాల్ గ్రామంలో నిర్వహిస్తామని అన్నారు. ఉమ్మడి మండలాల బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.





# కుట్టు మిషన్లను పంపిణీ చేసిన ఎంపీ గోడం నగేష్

## కేంద్ర ప్రభుత్వ సంస్థల ఓ ఎన్ జీ సీ ద్వారా మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేసిన ఎం పి గోడం నగేష్ .

**సమయజ్యోతి న్యూస్ జూలై 15 బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండలంలోని 18 గ్రామాలకు చెందిన కుట్టు మిషన్ శిక్షణ పొందిన వారికి 270 కుట్టు మిషన్లను స్థానిక ఫంక్షన్ హాల్లో ఓ ఎన్ జీ సీ సంస్థ సభ్యులు మృత్యుంజయ తో కలసి పంపిణీ చేశారు. సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహిళలకు ఆర్థిక స్వావలంబన పొందుటకు వారికి తోడ్పాటు అందించడానికి ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని కుట్టుమిషన్లను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో వారితో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటి పెల్లి రాజు , స్థానిక బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్ నాయకులు ఆల్క గణేష్ నానం రమణ, కొత్తపల్లి శంకర్, వామన్ గిట్టే, మురళీ తదితరులు పాల్గొన్నారు.



# పొంచి ఉన్న ప్రమాదం

**సమయజ్యోతి న్యూస్ జూలై 15 బజార్ హత్నూర్ బోథ్**

బోథ్ మండల కేంద్రము వెళ్లే అంతరాష్ట్ర ప్రధాన రహదారి బోథ్ ఎక్స్ రోడ్డు సమీపంలో కల్వర్టు వద్ద గుంత ఏర్పడింది ప్రమాదం జరగక ముందే గుంత పూడ్చి ప్రమాదం జరగకుండ చూడగలరని ప్రయాణికులు కోరుతున్నారు సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు



# బీసీ స్టడీ సర్కిల్ ఉచిత ఫౌండేషన్ కోర్స్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**



తెలంగాణ రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్స్ (1,2,3 మరియు 4) ఆర్ఆర్బి ఎస్ఎస్సి బ్యాంకింగ్, రిక్రూట్మెంట్లకు ఉచిత ఫౌండేషన్ కోర్స్ కోచింగ్ ప్రోగ్రాంను ఆగస్టు 25 నుండి 150 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులందరూ www.tgbc-studycircle.cgg.gov.in ద్వారా తేదీ 11-08-2025 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల వార్షికోదాయం గ్రామీణ ప్రాంతంలో రూ1.50 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2లక్షల లోపు కలిగి ఉండాలి. రిజర్వేషన్ నిబంధనల ప్రకారం అభ్యర్థుల ఎంపిక విధానం ఉంటుంది. అభ్యర్థులకు నెలకు రూ 1000 చొప్పున 5 నెలల పాటు ఉపకార వేతనం ఇస్తారు. వివరాలకు 08723-223004, 9381888746 లను ఆఫీస్ వేళలో సంప్రదించాలి.

# సిద్దుల గుట్ట ఆలయానికి 50 లక్షలు మంజూరు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**

ఆర్మూర్ పట్టణం లోని సుప్రసిద్ధ దేవాలయం నవనాథ సిద్దుల గుట్ట ఆలయానికి టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గతంలో సిద్ధుల గుట్ట ఆలయన్నీ సందర్శించినప్పుడు ఇక్కడ కటేజ్ ల నిర్మాణానికి 50 లక్షలు మంజూరు చేస్తానని ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేసినట్లుగా ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సిద్ధుల గుట్ట ఆలయ కమిటీ సభ్యులు, మంత్రి జూపల్లికి కృతజ్ఞతలు తెలిపారు.



# భూ భారతి చట్టం నిబంధనల మేర భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

## చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**



భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ తెలిపారు. మంగళవారం సిసిఎల్ఏ లోకేష్ కుమార్ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం పై అదనపు కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారానికి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఫైల్ ప్రాసెస్ మొత్తం ఆన్లైన్ పద్ధతి లో ప్రొసీజర్ ప్రకారం మాత్రమే నిర్వహించాలని, త్వరలో దరఖాస్తు పెండింగ్ ఎక్కడ ఉన్నది చెక్ చేసుకునే అవకాశం ప్రజలకు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. హై కోర్టు నుంచి వచ్చే తీర్పు మేరకు సాధా బైనామా దరఖాస్తులు పరిష్కారం చేయాల్సి ఉంటుందని, ప్రస్తుతం వాటిని మినహాయించి మిగిలిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పించాలని అన్నారు సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారీ వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ డి సెక్షన్ సూపర్డెంట్ రామచంద్రం, సంబంధిత సిబ్బంది, పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

## : టెన్త్ విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేసిన బండి సంజయ్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**



విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వర్యులు బండి సంజయ్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో జూనియర్ కళాశాల మైదానంలో 10వ తరగతి పిల్లలకు, ఆయన, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ బి గీతే, ఎమ్మెల్సీ అంజి రెడ్డిలతో కలిసి సైకిళ్ళు పంపిణీ చేశారు. విద్యా, వైద్యం రూపంలో రాజకీయాల కతీతంగా ప్రతి ఒక్కరికి సహాయం అందించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు మోడీ గిఫ్ట్ పేరిట 10వ తరగతి చదివే బాల బాలికలకు ఉచితంగా సైకిల్ అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు మొదటి ఆస్తి సైకిల్ అందించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించాలని సైకిల్స్ అందించామని అన్నారు. నాణ్యమైన సైకిల్ అందిస్తున్నామని, వీటిని వినియోగించి విద్యార్థులు సకాలంలో తరగతి గదులకు హాజరు కావాలని పేర్కొన్నారు. రాబోయే సంవత్సరాలలో కూడా 10వ తరగతి చదివే విద్యార్థులకు మోడీ గిఫ్ట్ కింద సైకిల్స్ అందిస్తామని అన్నారు. ఎల్.కే.జి నుంచి 6వ తరగతి చదివే విద్యార్థులకు మోడి కిట్స్ పేరిట బ్యాగ్, నోట్ బుక్స్, ఇతర సామాగ్రి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, పెద్ద పెద్ద కంపెనీలు వివిధ పనులపై వచ్చినప్పుడు వారితో చర్చించి సీ.ఎస్.ఆర్. నిధుల ద్వారా ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. చిన్నతనంలో గంటకు 15 పైసలు, 40 పైసలు కిరాయి తెచ్చుకొని సైకిల్ నడిపేవారిమని కేంద్రమంత్రి గుర్తు చేసుకున్నారు. సైకిల్స్ వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని అన్నారు. చిన్నతనం నుంచి అనేక ఇబ్బందులు గురైనప్పటికీ బాబా సాహెబ్ అంబేద్కర్ బాగా చదువుకొని దేశానికి రాజ్యాంగం రచించే స్థాయికి ఎదగారని అన్నారు. సిరిసిల్ల జిల్లా కలెక్టర్ నిబద్ధతతో పని చేస్తున్నారని అన్నారు. యూ.పి. రాష్ట్రానికి చెందిన కలెక్టర్, మహా రాష్ట్ర కు చెందిన ఎస్పీ క్రమశిక్షణ, పట్టుదల, ప్రణాళికతో కృషి చేయడం వల్ల గొప్ప స్థాయికి ఎదిగామని అన్నారు. విద్యార్థులు ఉదయం సమయంలో చదువుకోవాలని, మన తల్లిదండ్రుల కష్టాన్ని మనం ఎప్పుడూ గుర్తుంచుకోవాలని కేంద్ర మంత్రి తెలిపారు.విద్యార్థులు పట్టదలతో పని చేస్తుందని, 2014 కంటే ముందు విద్య కోసం 68 వేలకోట్లు కేటాయిస్తే, మోడీ ప్రభుత్వం ప్రస్తుతం 1,25,000 కోట్లు ఖర్చు చేస్తుందని, ఏకలవ్య పాఠశాలలు నవోదయ పాఠశాలలు సైనిక్ స్కూల్స్ క్రమశిక్షణకు మారుపేరుగా పని చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని అన్నారు. రోడ్డుపై సైకిల్ నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, 20 రోజుల తర్వాత సర్వీసింగ్ చేసుకోవాలని తెలిపారు.ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలనే ఉద్దేశంతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సైకిల్స్ పంపిణీ చేస్తున్నామని అన్నారు. చిన్నతనంలో సర్వ శిక్షా అభియాన్ లో చదువుకునే రోజుల్లో తాను పడిన ఇబ్బందులు విద్యార్దులకు ఉండవద్దని బహుమతిగా సైకిల్స్ అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. మోడీ గిఫ్ట్ పేరిట అందిన సైకిల్స్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, రోడ్డు పై జాగ్రత్తగా నడపాలని అన్నారు. ఎస్.ఆర్. ట్రస్ట్ తరపున విద్యార్థులకు 10వ తరగతి తర్వాత ఎటువంటి కెరియర్ ఆప్షన్స్ ఉంటాయో తెలుసుకునేందుకు వీలుగా పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ కేంద్ర హోం సహాయ మంత్రి సిరిసిల్ల జిల్లాలో 4 వేల సైకిళ్ళ పంపిణీకి శ్రీకారం చుట్టారని అన్నారు. విద్యా సంవత్సరం సిరిసిల్ల జిల్లాలో 10 వేల మంది విద్యార్థులు అదనంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని, రానున్న రోజుల్లో మరింత మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ తెలిపారు.లిఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ,లి విద్యార్థులకు ఎంపీ మంచి సైకిల్స్ అందించారని, వర్షా కాలంలో రోడ్లు స్కిడ్ అధికంగా అవుతాయని, విద్యార్థులు జాగ్రత్తగా నడపాలని అన్నారు. అనంతరం కాలేజీ గ్రౌండ్ నుండి బతుకమ్మ ఘాట్ వరకు విద్యార్థులతో సైకిల్ ర్యాలీ ని జెండా ఊపి ప్రారంభించి కొంత దూరం సైకిల్ సవారీ చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు ఇన్చార్జి డిఈఓ వినోద్ కుమార్, స్థానిక నాయకులు, విద్యార్థులు, ప్రజలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దశల వారీగా అన్ని సమస్యలు పరిష్కరిస్తా

## కార్పొరేటర్ పుష్పానగేష్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**



రామచంద్రపురం డివిజన్ అభివృద్ధి లో దూసుకువెళ్తున్న కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఈరోజు ఓల్డ్ రామచంద్రాపురం పాషా కాలనీ లో ప్రతి వారం ఒకరోజు ఉదయం 06:00 గంటలకు మార్నింగ్ వాక్ విత్ అఫీషియల్స్ బస్తీ దర్శన్ కార్యక్రమంలో మంగళవారం ఎఎంఓహెచ్ విజయ్ మోహన్ ఎస్ఎస్ పవన్ రాంకీ ఇంచార్జ్ విజయభాస్కర్ రెడ్డి జిహెచ్ఎంసి శానిటేషన్ రాంకీ విభాగ అధికారులు సిబ్బంది తో కలిసి బస్తీలో పర్యటించి బస్తీ లో ఉన్న ప్రధాన సమస్యలను వర్షాకాలంలో ఓపెన్ డ్రైన్ నిండిపోయి ఇళ్లలకి నీరు చేరి చాలా ఇబ్బంది పాలవుతున్నామని పర్యటనలో స్థానికులు తెలపగ కాలనీ ఎంట్రన్స్ లో రోజురోజుకు చెత్త చెదారం పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని రెండు మూడు పోల్స్ పడిపోయే స్థితిలో ఉన్నాయని స్ట్రీట్ లైట్స్ కూడా కావాలని దోమల బెడద నుంచి ఉపశమనం పొందేందుకు స్ప్రేయింగ్ చెయ్యాలని బస్తీ వాసులు తెలపడంతో పనులన్ని దశలవారీగా త్వరలోనే పరిష్కరిస్తానని స్థానిక రామచంద్రాపురం కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు వారితో చాంద్ రఫీక్ నవీన్ గౌడ్ చిగురు శ్రీను రాములు యాదవ్ కిరణ్ గౌడ్ అప్పల భాస్కర్ రవి గౌడ్ అప్పల సత్తి సంతోష్ గౌడ్ మహిపాల్ గౌడ్ కురుమ శ్రీను కుమ్మరి మనయ్య హర్ష సంతోష తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ షూస్ పంపిణీ

**సమయజ్యోతి న్యూస్ ప్రతి నిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత పట్టణంలోని దేశాయి మురళీధర్ రెడ్డి మెమోరియల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దేశాయి మురళీధర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రెండు జతల స్కూల్ షూ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి భాస్కర్ సింగ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మమ్మ, సింగిల్ విండో మెంబర్ ఎం. చిన్న వెంకట్ రెడ్డి దేశాయి ప్రకాష్ రెడ్డి సేవా సమితి అధ్యక్షులు సయ్యద్ కలాం పాషా పాఠశాల ఉపాధ్యాయులు రాములు, ఆనందలక్ష్మి, శ్రీలత, సుధా, హరిత, మాసూమ్, బి.జ్యోతి, బాలమణి, శ్రావణి, సుహాని తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీడీవో గా పి. లచ్చాలు చేరిక

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఎంపీడీవో గా పి.లచ్చాలు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపివో బిర్ల బీరయ్య, సూపరింటెండెంట్ వినోద్ కుమార్, ఏపీవో ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్ ఓ వాటర్ ప్లాంట్ వితరణ

## ప్రారంభం చేసిన దాత కొత్తూర్ వెంకటమ్మ కుటుంబ సభ్యులు

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ.. నారాయణపేట జిల్లా**

మండలంలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం కొత్తూర్ వెంకటమ్మ కుటుంబ సభ్యులు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు 1000 లీటర్ల సామర్థ్యం గల ఆరో ఓ ప్లాంట్ ను వితరణ చేసి అనంతరం రిబ్బన్ కట్ చేసి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. అనంతరం ఈ కార్యక్రమానికి వచ్చిన ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు త్రాగటానికి మరియు మధ్యాహ్న భోజనానికి ఉపయోగపడే విధంగా 1000లీటర్ల సామర్థ్యం గల ఆర్ ఓ వాటర్ ప్లాంట్ సమకూర్చిన కీ.శే కొత్తూర్ రామకృష్ణ గారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నీటి వల్లనే 90% రోగాలు వస్తాయి, అదే నీటి వల్లనే 99% రోగాలు పోతాయని అలాంటి సురక్షిత మంచి నీటి సౌకర్యం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లభించడం ఆరోగ్యం పట్ల గొప్ప సదా అవకాశం ఏర్పడిందని కొనియాడారు. అలాగే బడుగు బలహీన వర్గాల పిల్లల అభ్యున్నతికై పాటుపడుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దండు శేఖర్ ను ప్రత్యే కంగా అభినందించారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈఓ నిజాముద్దీన్, కాంప్లెక్స్ ప్రధానో పాధ్యా యుడు గణేష్ సింగ్, పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు వై. జనార్దన్ రెడ్డి పాఠశాల ప్రధానో పాధ్యాయుడు దండు శేఖర్, పంచాయతీ కార్యదర్శి రాజు,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జయమ్మ, వివిధ



పార్టీల నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్,భీమ్ శంకర్, దండు రాఘవేంద్ర, బాలరాజ్, రాఘవేంద్ర గౌడ్,కృష్ణయ్య, ఉపాధ్యాయులు భారతి,రవి కుమార్,ఆస్మా నిషాత్, పీఈటీ యండి సోఫీ, వాలంటీర్ శిరీష,మధ్యాహ్న భోజన సిబ్బంది పద్మమ్మ, నర్సమ్మ, సురేఖ, చాంద్ బీ, సర్వీస్ పర్సన్స్ వెంకటేష్, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు టీచింగ్ డైరీని, పాఠ్య ప్రణాళికను తప్పనిసరిగా వ్రాయాలి

## కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గణేష్ సింగ్

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా**

మండలంలోని మురహర్ దొడ్డి ప్రాథమిక పాఠశాలను మంగళవారం గుడెబల్లూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గణేష్ సింగ్ ఆకస్మికంగా పర్యవేక్షణ చేశారు. పర్యవేక్షణలో భాగంగా 3వ, 4వ తరగతి తెలుగు భోదిస్తున్న తరగతిని సందర్శించారు.సంసిద్ధత పాఠాలలో భాగంగా సరళ పదాలు విని పిల్లలతో ఇంటరాక్ట్ అయి వారితో బోర్డుపై రాసిన సరళ పదాలను విద్యార్థులతో చదివించి, బోర్డు రాయించి సంతృప్తి వ్యక్తం చేశారు.అలాగే పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు తెలిపారు.1 టీచింగ్ డైరీని, లెస్సన్ ప్లాన్ ను ఉపాధ్యాయులు తప్పనిసరిగా వ్రాయాలి.2 విద్యార్థుల వర్క్ షీట్లను పరిశీలించి, పాఠ్యాంశ బోధన తర్వాత ఖచ్చితంగా వర్క్ షీట్స్ ను విద్యార్థులతో పూర్తి చేయించాలి.3 విద్యార్థులు రాసిన బేస్ లైన్ పేపర్లను చూడడం జరగాలి.4 విద్యార్థులు రోజు తెలుగు ఇంగ్లీషులో లో ఒకటి లేదా రెండు పేరా గ్రాఫ్ లు ఇంటి దగ్గర నేర్చుకోవాలి.5 తరగతి గది బోధన సమయంలో టిఎల్ఎం ను ఉపయోగించాలి.6 ఒక పీరియడ్ తప్పకుండా గ్రంథాలయానికి కేటాయించాలి.7 అదేవిధంగా వంటగది,మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి వారికి సూచనలు చేయాలి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈరన్న,ఉపాధ్యాయులు యం.ఆర్.అజయ్,కుమారి ఆకాంక్ష ఉన్నారు.



# తీన్మార్ మల్లన్న కార్యాలయం పై దాడిని ఖండించిన బీసీ సంక్షేమ సంఘం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయం పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జాగృతి అనుచరులు జరిపిన దాడి ఘటనను ఖండిస్తూ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ ఏరియా అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపి తీవ్రంగా హెచ్చరించడం జరిగింది. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిల్ల శ్రీనివాస్, పట్టణ యూత్ అధ్యక్షుడు ముడారపు శేఖర్ లు మాట్లాడుతూ బిఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు బీసీల కోసం మాట్లాడని ఆలోచించని వాళ్ళు ఎప్పుడు బీసీల పట్ల కపట ప్రేమను చూపిస్తూ, మా బీసీ బిడ్డ తీన్మార్ మల్లన్న మీద చేసిన దాడిని ముక్త కంఠంతో ఖండిస్తున్నామని అన్నారు. తెలంగాణ యాస, భాషల పై అవగాహన లేని వాళ్ళు ఎప్పుడు బీసీ బిడ్డ చట్ట సభల్లో వాళ్లతో పాటు కూర్చుంటే అనగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని బీసీ సమాజం అంత గమనిస్తుందని ఇకపై బీసీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు జాడ క్రాంతి కుమార్, పారుపెల్లి శివరామకృష్ణ, చెప్పాల రమేష్, రెడ్డి అయిలయ్య, మొగిలిచెర్ల రాజేష్, రవి, రమేష్ లు పాల్గొన్నారు.



# కాలడి శ్రీ ఆది శంకర మఠం.. విద్యాసామాగ్రి పంపిణీ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

తెలంగాణ రాష్ట్రం కాలడి శ్రీ ఆది శంకర విద్యా నిధి పథకంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని వివిధ గ్రామాల నిరుపేద విద్యార్థులకు ఆ మఠం క్షేత్ర ఆచార్యులు బికెఎస్ ఉన్ని కృష్ణన్ నంబూత్రి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మటం మేనేజర్ శ్రీపాద శర్మ, అయ్యప్ప ఆలయ వ్యవస్థాపకులు రాజు గురుస్వామి, హనుమాన్ దేవాలయ ప్రధాన అర్చకులు మధువు రాజేశ్వర్ శర్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, కొండల్ రెడ్డి, రమేష్, బాల్ రెడ్డి పాల్గొన్నారు.



# భారతి నగర్ డివిజన్ లో రోడ్ సేఫ్టీ స్పెషల్ డ్రైవ్

## కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

మంగళవారం పటాన్చెరు నియోజకవర్గం భారతి నగర్ డివిజన్లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించినట్లు కార్పొరేటర్ సింధుఆదర్శ్ రెడ్డి తెలిపారు ఈ సందర్భంగా మ్యాక్ సొసైటీ కాలనీలో రోడ్డుపై గుంతల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కార్పొరేటర్ సింధుఆదర్శ్ రెడ్డి సూచనల మేరకు జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్ సిబ్బంది ద్వారా గుంతలను పూడ్చే పనులు చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎక్కడైనా గుంతలు ఉంటే జీహెచ్ఎంసీ సిబ్బంది వెంటనే స్పందించి పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలకు రవాణా లో ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు అనంతరం మ్యాక్ సొసైటీ లో ఉన్న పార్కును సందర్శించి మరమ్మతుల పనులను పర్యవేక్షించారు పార్క్ లో పిల్లల కోసం ప్లే ఎక్విప్మెంట్స్ సీనియర్ సిటిజన్స్ కోసం బెంచీలు ఏర్పాటు చేయాలని సూచనలు చేశారు పార్కు పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఏఈ ఫైజాన్ వర్క్ ఇన్స్పెక్టర్ అక్రమ్ మ్యాక్ సొసైటీ డైరెక్టర్లు రామరావు దుర్గారెడ్డి బీఆర్ఎస్ యువజన నాయకులు సుధాకర్ విజయ్ రాజు కొండల్ పాల్గొన్నారు



# అడుగడుగునా గుంతలే పట్టించుకోని పాలకులు, అధికారులు గ్రామయువకుడు జంబయ్య

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా**

మండలంలోని మురహరి దొడ్డి గ్రామం నుండి టై రోడ్ వరకు ప్రతినిత్యం వందల సంఖ్యలో ఆయా గ్రామల ప్రజలు, రైతులు,పాఠశాల విద్యార్థులు, ప్రైవేటు ఉద్యోగస్తులు వాహనాలపై రాకపోకలు జరుగుతుంటాయి.ఇట్టి ప్రధాన రోడ్డుపై అడుగడుగునా గుంతలే, గుంతల మయంగా మారింది అని గ్రామ యువకుడు జంబయ్య మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. మురహరి దొడ్డి నుండి టై రోడ్డు కు రావాలన్నా పోవాలన్న వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో నూతన బీటీ రోడ్డు మంజూరు చేసింది అని గత పాలకులు అన్నారు.అయినా నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులు మాత్రం జరగలేదు.ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్న కూడా మా గ్రామం వైపు మా ఊరి రోడ్డు వైపు ఏ ఒక్క అధికారి కూడా రోడ్డు గురించి పట్టించుకునే నాధుడే లేడని అన్నారు. పలుమార్లు మా ఊరి రోడ్డు గురించి అధికారులకు చెప్పిన కూడా పట్టించుకోలేదు.కనీసం మరమ్మతుల పనులు కూడా చేయలేదు.ఈ గుంతల మయమైన రోడ్డుపై ప్రతిరోజూ విద్యార్థులు, వాహనదారులు కిందపడి గాయాల పాలైన సందర్భాలు కూడా ఉన్నాయి. కనుక ఇప్పటికైనా పాలకులు అధికారులు మా గ్రామానికి నూతన బీటీ రోడ్డు ను మంజూరు చేయాలని అన్నారు.



# రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ సమావేశం

**సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్ బ్యూరో**



హైదరాబాద్ లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయంలో మంగళవారం రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్రంలోని 311 సహకార సంఘాల అధ్యక్షులు, సీఈఓ లతో సమావేశం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ, సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరవగా, సహకార బ్యాంకు అధ్యక్షులు రవీందర్ రావు, నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, వివిధ జిల్లాల డీసీసీబీ ల అధ్యక్షులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో పూర్తిస్థాయి టీపిఓను నియమించాలని వినతి పత్రం ఇచ్చిన బిఎస్పి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి



మందమర్రి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న టీపీఓ ను తాత్కాలికంగా కాకుండా పూర్తిస్థాయి టీపిఓ ను నియమించి పట్టణ అభివృద్ధి చెందేలా చూడాలని మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు కు వినతి పత్రం ఇచ్చిన బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మందమర్రి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న టీపీఓ అధికారిని వారానికి 2 రోజులు మాత్రమే విధులు నిర్వహించాల్సి ఉండగా ఆ 2 రోజులు కూడా పట్టణ ప్రజలకు అందుబాటులో లేక ప్రజల సమాన్య పనులు జరగక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. టిపిఓ విధులకు సరిగా హాజరు కాకపోవడంతో మున్సిపాలిటీలో ముగ్గురు టీపీబిఓ లను నూతనంగా నియమించారు వీరికి పని చెప్పే అధికారిని లేక పోవడంతో ముగ్గురు టీపీబిఓ అధికారులకు కూర్చోబెట్టి జీతాలు ఇస్తున్నారని పట్టణ ప్రజలు మండిపడుతున్నారని అన్నారు. డిప్యూటేషన్ పై వచ్చిన అధికారిని మార్చి పూర్తిస్థాయి టిపిఓ ను నియమించాలని పట్టణ ప్రజల, బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ అధ్యక్షుడు గాజుల శంకర్, నాయకులు ఎండి మతిన్ ఖాన్, ఎస్కె రహీం బాబా లు పాల్గొన్నారు.

# బీసీ ధర్నాకు తరలిన నాయకులు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండలం నుండి హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగిన బి. సి. ప్రజా ప్రతినిధుల ఫోరం ధర్నా కార్యక్రమానికి బిఅర్ఎస్ బి.సి విభాగం నాయకులు, ప్రజాపతి నిధులు తరలి వెల్లారు. కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టో కామారెడ్డి బి.సి డిక్లరేషన్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, చట్టబద్ధతగాని ఆర్డినెన్స్ ఇస్తూ కాలయాపన చేస్తూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గద్దె నెక్కి వెన్ను పోటు పొడిచి హామీలను తుంగల తొక్కి బీసీలను మరోసారి మోసం చేస్తున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చాక 6 నెలల్లో అమలు చేస్తా అని చెప్పి మరియు బీసీ లకు బి.సి స్లాబ్ ప్లాన్ కింద ప్రతి యేటా 2 వేల కోట్ల నిధులు కేటాయిస్తా అన్న హామీ ఏమైంది అని ? మరియు మండలానికి ఒక బీసీ గురుకులాలను జిల్లాకు ఒక బీసీ భవనాన్ని నిర్మిస్తానన్న హామీ ఏమైనది ? అట్లాగే బీసీలకు సామాజికంగా ఆర్థికంగా ఇచ్చిన హామీలు ఏమైనావని నిలదీశారు. బీసీలలో మేజర్ కులాలైనటువంటి ముదిరాజు, గంగపుత్ర ,పద్మశాలి ఇలా ఆరు కులాలకు ఇచ్చినటువంటి హామీలు ఏమైనావని అట్లాగే కుల వృత్తుల కోసం సంక్షేమ కార్యక్రమాలు ఏమైనావని? నిరసన తెలిపారు. బి.సి నాయకులు మాజీ జడ్పీటీసీ దాసరి వెంకటేష్, నాయకులు శ్రీకాంత్ యాదవ్, నారాయణ, కన్న పోశెట్టి, యూత్ అధ్యక్షులు గాండ్ల రాజేష్, గోవర్ధన్, లక్ష్మి నారాయణ, శ్రీకాంత్ చారి పాల్గొన్నారు



# పెన్షనర్లకు వేతన సవరణ, డి.ఏ లాభాలు కల్పించాలి

## : ఆదిలాబాద్‌లో ధర్నా చేసి మెమొరాండం సమర్పించిన పెన్షనర్లు

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ , జూలై 15, 2025



తెలంగాణ ఆల్ పెన్షనర్స్ %d% రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్లు జూలై 15, 2025న ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్. శశికాంత్, కార్యదర్శి జగన్ మోహన్ నేతృత్వంలో జె.సి. శ్యామలాదేవి కి మెమోరాండం సమర్పించారు. నేరుగా కేంద్ర ప్రభుత్వం మే 25న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక బిల్లులో తీసుకొచ్చిన చట్టం ప్రకారం, ఉద్యోగులు మరియు పెన్షనర్లను జనవరి 2026కి ముందు, తర్వాత అని విభజిస్తూ, ఇకపై వచ్చే వేతన సవరణ కమిషన్ (పి.ఆర్.సి), డియర్‌నెస్ అలవెన్స్ (డి.ఎ) ల లాభాలు జనవరి 2026కి ముందు ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు వర్తించవని పేర్కొంది. ఈ విధానం వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద స్థాయిలో పోరాటం చేయకపోతే, పెన్షనర్లకు న్యాయం జరగదని సంఘం నేతలు హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పులను కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం, ప్రధానమంత్రి స్వయంగా రివ్యూ పిటిషన్ వేయడం వలన పెన్షనర్ల హక్కులు నష్టపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మెమోరాండంలో ప్రధాన డిమాండ్లు:

1. 8వ వేతన సవరణ సంఘాన్ని తక్షణమే నియమించి, విధివిధానాలు విడుదల చేయాలి. ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి వేతన సవరణ జరిగేలా చూడాలి.
2. కరోనా సమయంలో బకాయిలుగా ఉన్న 18 నెలల డియర్‌నెస్ అలవెన్స్ (డి.ఎ.) ను వెంటనే చెల్లించాలి.
3. పెన్షనర్లకు సమగ్ర వైద్య సేవల స్కీమ్ రూపొందించి అమలు చేయాలి.
4. కోవిడ్‌కు ముందు ఉన్న సీనియర్ సిటిజన్ రైలు ప్రయాణ రాయితీలను పునరుద్ధరించాలి.
5. కమ్యూటేషన్ రికవరీ వ్యవధిని 15 సంవత్సరాల నుండి 11 సంవత్సరాలకు తగ్గించాలి.
6. సీటీ కంపెన్సేటరీ అలవెన్స్ (సి.సి.ఎ.) పెన్షన్ నిబంధనలను రద్దు చేసి, ఉద్యోగ విరమణ తేదీ ఆధారంగా పెన్షనర్లను విభజించే విధానాన్ని నిలిపివేయాలి.
7. ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి, తెలంగాణ హైకోర్టు తీర్పులను అందరికీ వర్తించేలా చేయాలి.
8. ప్రధాన మంత్రి వ్యయ వందన యోజన స్కీమ్ ను తెలంగాణలో అమలు చేయాలి, అలాగే బకాయిలు ఉన్న డియర్‌నెస్ అలవెన్స్ (డి.ఎ.)లను విడుదల చేయాలి.

సంఘం నేతలు డిమాండ్లను తక్షణమే పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నూతల దయాకర్ రెడ్డి, గంగాధర్, బాపురావు, గాలిపెల్లి దేవీదాస్, సామల రాజవర్ధన్, ఉమాకాంత్, కాళ్ల పురుషోత్తం, షబ్బీర్, కె. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భార్యను వేధించిన కేసులో భర్తకు మూడేళ్ల జైలు శిక్ష

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి సిరిసిల్ల

మద్యానికి డబ్బుల కోసం భార్యను వేధించిన కేసులో భర్త కంది రమేష్ కి సిరిసిల్ల రెండవ అదనపు మెజిస్ట్రేట్ గడ్డం మేఘన మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువడించినట్లుగా తంగళ్ళపల్లి ఎస్ ఐ ఉపేంద్ర చారి ఒక ప్రకటనలో తెలిపారు.

# బాలికల వసతీ గృహాన్ని సందర్శించిన వైద్యాధికారిని

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండల బిసి బాలికల వసతి గృహాన్ని మంగళవారం కిసాన్ నగర్ పిహెచ్సి వైద్యాధికారిని ప్రవంతి క్షేత్రస్థాయిలో సందర్శించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, అనారోగ్యంతో ఉన్న పిల్లలకు చికిత్స గురించి అవగాహన కల్పించారు. వసతి గృహాన్ని, వంటగదిని పరిసరాల పరిశుభ్రత, త్రాగునీరు పరిశీలించారు. సూపర్వైజర్ వేణుగోపాల్, మేరమ్మ, ఏఎన్ఎం లత పాల్గొన్నారు.




# ఇందిరా మహిళా శక్తి సంబరాలు..

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

మహమ్మద్ షబ్బీర్ అలీ, మంత్రి సీతక్క

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి కామారెడ్డి



కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణంలోని వెంకట కన్వెన్షన్ హాల్ లో జరుపుకున్న ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కతో కలిసి, ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. వారి మాటల్లో యథాతథంగా.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. సంబరాల్లో భాగంగా అక్షర లక్ష్మి కార్యక్రమం ద్వారా సంఘాల్లో సభ్యులుగా ఉన్న ప్రతి మహిళకూ కనీస విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అదనంగా, మహిళా సంఘాల్లో భాగముకాని కొత్త మహిళలను చేర్చి, కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలి. ప్రతి సంఘ సభ్యురాలికి జీవిత బీమా తప్పనిసరిగా ఉండాలని సూచించడంతో పాటు, తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే మహిళలకు రూ1లక్ష రుణ సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళలను కోటీశ్వరులని చేయడమే కాంగ్రెస్ లక్ష్యం. ప్రభుత్వం నుండి మహిళలకు మహిళా సమైక్య ద్వారా పెట్రోల్ బంకులు ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వడం జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల స్కూల్ యూని ఫాంలు కుట్టే బాధ్యతను ఐకేపీ మహిళా సంఘాలకే అప్పగించడం ద్వారా స్వయం ఉపాధికి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రైవేట్ సంస్థలకు అవసరమైన యూనిఫాంలను కుట్టే పనులను కూడా మహిళా సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ లో స్త్రీ శిశు సంక్షేమానికి 2862 కోట్లు కేటాయించి మహిళలకు పెద్దపీట వేశారు. వారిని కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో పలు పథకాలను ప్రతిపాదించిన రేవంత్ సర్కారు. గ్రామీణ మహిళాభివృద్ధికి ఇందిరా మహిళా శక్తి పథకం మహిళకు ఒక వరం లాంటిది అన్నారు.

# నమ్మించి మోసం చేసిన వ్యక్తి పై కేసు నమోదు.

## - ఆదిలాబాద్ 1వ పట్టణ సీఐ బి సునీల్ కుమార్.

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :




నమ్మించి మోసం చేసిన ఘటనలో నిందితుడు రోహిత్ షిండే పైన కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఓ ప్రకటనలో ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి సునీల్ కుమార్ తెలియజేశారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం బాధితుడు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన షేక్ ఇర్ఫాన్, తండ్రి షేక్ మన్నాన్, నివాసం ఖుర్షీదాపూర్, ఆదిలాబాద్ పట్టణంలో వ్యాపారం చేస్తుంటాడు. బాధితుడు ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో నిందితుడు రోహిత్ షిండే పై ఫిర్యాదు చేస్తూ, గత కొన్ని రోజుల క్రితం నిందితుడు తన అమ్మకు ఆరోగ్యం బాలేదని తన వద్ద 90 వేల రూపాయలను తీసుకొని తన యొక్క కారును కొదవ పెట్టి రెండు నెలల్లో తిరిగి ఇస్తానని చెప్పి నమ్మబలికి, అతనికి నమ్మకద్రోహం చేసి మోసం చేశాడని ఫిర్యాదు చేశాడు. ఒకరోజు బాధితునికి తెలియకుండా ఆదిలాబాద్ మున్సిపాలిటీ వద్ద రోడ్డుపై ఉన్న వాహనాన్ని రోహిత్ షిండే తీసుకెళ్లి ఇతరులకు అమ్మి వేయడం జరిగిందని, తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగిన ఎడల తనని డబ్బులు ఇవ్వనని బెదిరించడంతో, ఇన్ని రోజులు భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదన్నారు. చివరగా గత్యంతరం లేక పోలీసులకు సంప్రదించి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. నిందితుడిపై తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితులు కోరినట్లు తెలిపారు. ఈ విషయమై ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో నిందితుడు రోహిత్ షిండే పై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి సునీల్ కుమార్ తెలిపారు.

# కల్తీ కల్లు అమ్మితే జైలుకే. కల్లు దుకాణాలపై దాడులు చేసిన ఎక్సైజ్ అధికారులు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి చిన్న చింతకుంట మహబూబ్ నగర్ జిల్లా.



రంగంలోకి దిగిన ఎక్సైజ్ ఎస్సై సుష్మ బృందం. హైదరాబాద్ కూకట్ పల్లి కల్తీ కల్లు ఘటన నేపథ్యంలో కల్తీ కల్లు తో ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుకుంటున్న కల్లు దుకాణాల పై రాష్ట్రంలోని కల్లు కంపౌండ్లు, దుకాణాలపై మెరుపు దాడులు నిర్వహించాలని ఎక్సైజ్‌శాఖ ఆదేశాలతో గతవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దేవరకద్ర నియోజకవర్గంలోకొంట్ల మండలం లో ఆబ్కారీ శాఖ కల్లు దుకాణాలను తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించి రెండు గ్రామాలలో అనుమతి లేకుండా నడుపుతున్న కల్లు దుకాణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుష్మ తెలిపారు.

# గ్రామాల్లో స్థానిక సంబరం

## ఎన్నికల కోసం కదులుతున్న పార్టీలు

**హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి**

స్థానిక ఎన్నికల సమరంపై కాంగ్రెస్‌లో ఉత్సాహం నెలకొంది. బిసి రిజర్వేషన్లు తమను గట్టెక్కిస్తాయని చాలామంది భావిస్తున్నారు. గ్రామస్థాయిలో బిసి నేతలంతా ఇప్పుడు కాంగ్రెస్ జెండా పట్టుకుని ఊరేగుతున్నారు. గ్రామాల్లో ఇంకా బిఆర్ఎస్ పార్టీ కేడర్ బలంగా ఉండగా, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన ఊపుతో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేడర్‌ను బలోపేతం చేసుకోవడం వంటి పరిణామాలతో స్థానిక ఎన్నికల పోరాటం హోరాహోరీగా ఉండనుంది. బీసీలకు రిజర్వేషన్లు

ఇచ్చామనే అంశంతో కాంగ్రెస్ ముందుకు వెళ్లనుంది. రిజర్వేషన్లతో పాటు రైతులకు రుణమాఫీ, రైతుభరోసా వంటి కార్యక్రమాలను కూడా కాంగ్రెస్ ఇప్పటికే ప్రచారం చేసుకుంటోంది. కేడర్ కూడా

ఉత్సాహంగా ముందుకు సాగుతోంది. గ్రామాల్లో ఇప్పటికే ఎవరు దేనికి పోటీ చేస్తున్నారో ఖరారు చేసేసుకుంటున్నారు. సర్పంచ్ ఎన్నికలకు మాత్రం పోటీ విపరీతంగా పెరిగింది. అలాగే బీఆర్ఎస్ తమకున్న కేడర్, గతంలో చేసిన పనులు, ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందని అభిప్రాయపడుతోంది. ఇప్పటికే ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు తరచూ పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశర చేస్తున్నారు. బీసీ రిజర్వేషన్లు అమలయ్యే పక్షంలో తమ వ్యూహాలను మార్చుకునే అవకాశం ఉంది. ఇక గతంలో ఎన్నడూ లేనంతగా బీజేపీ కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టింది. ప్రత్యామ్నాయ పార్టీగా ఎదగడానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఉపకరిస్తాయని ఆ పార్టీ నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓటు బ్యాంకును సద్వినియోగం చేసుకుని.. సరైన అభ్యర్థులను నిలిపితే ఫలితం ఉంటుందని నాయకులు అభిప్రాయ పడుతున్నారు. అయితే పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తుపై కాకుండా నిర్వ హిస్తారు. పరిషత్ ఎన్నికల్లో మాత్రం పార్టీ గుర్తులు ఉంటాయి. కాబట్టి కాంగ్రెస్ పార్టీ ముందుగా పరిషత్ ఎన్నికలను నిర్వహించి, ప్రభుత్వ పనితీరుకు గెలుపు అని చెప్పాలని భావిస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని భావిస్తుండగా.. గతంలో రిజర్వేషన్లు తక్కువగా ఉన్న సమయంలోనూ బీసీలు జనరల్ స్థానాల్లో ఎక్కువ సీట్లు గెలుచుకున్నారు. ఒకవేళ బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు ఇవ్వలేని పక్షంలో పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వా లని కాంగ్రెస్ గతంలో భావించింది. దానిపై కొంత విమర్శలు రావడంతో ఎలాగైనా చట్టబద్ధత కల్పించాలని భావిస్తోంది. ఈ విషయమై ఇప్పటికే కేబినెట్ తీర్మానం చేసింది. దాంతో ఆశావహులు పల్లెల్లో ముమ్మరంగా తిరుగుతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఇటీవలి కాలంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఎక్కువ సంఖ్యలో నిర్మించడం, సన్న బియ్యం పథకం వంటి అంశాలు తమకు కలిసి వస్తాయని ఆ పార్టీ భావిస్తోంది.

# బిసి రిజర్వేషన్లతో దిక్కుతోచని బిఆర్ఎస్

## -స్థానిక ఎన్నికల్లో వారికి భంగపాటు తప్పదు-బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ షబ్బీర్ అలీ

**కామారెడ్డి,జూలై15(సమయజ్యోతి):**

బిసి రిజర్వేషన్లు, రైతులకు రుణమాఫీ, రైతుభరోసాతో బిఆర్ఎస్‌కు దిక్కుతోచడం లేదని అందుకే కావాలనే ఇతర అంశాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని మాజీమంత్రి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ మండిపడ్డారు. బిసిలపై మాట్లాడే హక్కు బిఆర్ఎస్‌కు లేదన్నారు. కవిత చేస్తున్న డ్రామాలు ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు. ఇకపోతే ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని అన్నారు. గతంలో ప్రభుత్వ పథకాల పేరుతో 9ఏళ్లల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు భారీగా సంపాదించారని షబ్బీర్ ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, కరెంట్, జీతాలు తదితర విషయాల్లో ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్ఎస్ చేస్తోందని అన్నారు,. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. మిషన్ భగీరథ పెద్ద ఫ్రాడ్ అని తేలిందని అన్నారు. ధరణి ఒక దుర్మార్గమైన సాఫ్ట్‌వేర్ అని కూడా తేలిపోయిందని మండిపడ్డారు. ఏ గ్రామంలో మిషన్ భగీరథ నీళ్ళు రావడం లేదన్నారు. పైపులు, ట్యాంకులు ఉన్నాయి గానీ నీళ్ళు రావడం లేదన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని స్పష్టం చేశారు. కరెంట్ కోసం బీఆర్ఎస్ చేసింది ఏంటి అని ప్రశ్నించారు. అప్పులుచేసి మింగారని అన్నారు. ఇవన్నీ రేపటి స్థానిక ఎన్నికల్లో చెప్పి ప్రజలతోనే నిలదీస్తామని అన్నారు. భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్ల పేరుతో నిధులు దుర్వినియోగం చేశారని అన్నారు. అయినా బీఆర్ఎస్ నేతలకు అవగాహన రావడం లేదని విమర్శించారు. ఉచిత విద్యుత్‌పై బీఆర్ఎస్ చేసింది ఏంటని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్, హరీష్ పని అయిపోయిందన్నారు. ఎత్తిపోయిన బీఆర్ఎస్ గురించి ఏం మాట్లాడుతాం అంటూ వ్యాఖ్యలు చేశారు. లక్షల కోట్ల రూపాయలు దండుకోవడం తప్ప కేసీఆర్ ఏం చేయలేదన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని కుటుంబం ఉండకూడదు అనేది కాంగ్రెస్ పాలసీ అని అన్నారు. అందుకే ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అందరికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సింగరేణి సంస్థ రాష్ట్ర అస్థి. గనులన్ని సింగరేణికి ఉండేలా చూస్తామన్నారు. ప్రభుత్వ అండతో ప్రైవేట్ సంస్థలు శ్రమ దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. ధరణి వల్ల లక్షల మంది తమ భూములపై హక్కులు కోల్పోయారన్నారు. ధరణి వల్ల ప్రజలకు చాలా నష్టం కలిగిందని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ద్వారా ప్రజల సంపద ప్రజలకు పంచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రజల అవసరాలే తమ అజెండా అన్నారు. గతంలో సంపద, వనరులు, స్వేచ్ఛ పాలకులకే పరిమితమయ్యాయని అన్నారు. తాము ఏం చేశామో ప్రజలకు



తెలుసన్నారు. తొమ్మిది ఏండ్లలో ఏదో అద్భుతం జరిగినట్టు కేటీఆర్ భ్రమ కల్పిస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగ యువత కాంగ్రెస్‌కు పట్టం కట్టారని అన్నారు. ధరణితో తమ భూములు తమకు కాకుండా చేసారని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ పూర్తిగా ఫెయిల్ అయిందన్నారు. కేసీఆర్ పాలనలో ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని చెప్పుకొచ్చారు. తెలంగాణలో స్వేచ్ఛనే లేకుండ పోయిందన్నారు. భయం భయంగా బతకాల్సిన పరిస్థితి తెలంగాణలో ఉండేదన్నారు. ఇచ్చిన హామీల అమలుకు సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ఇవే స్థానిక ఎన్నికల్లో మరోమారు బిఆర్ఎస్, బిజెపిలను దెబ్బకొట్టేలా చేస్తామని అన్నారు.

# పంచాయితీ ఎన్నికలపై బిఆర్ఎస్ నజర్

## మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ సమాలోచనలు

**మహబూబ్‌నగర్,జూలై15(సమయజ్యోతి):**



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పంచాయితీ ఎన్నికలు బిఆర్ఎస్ నేతలకు సవాల్ కానున్నాయి. ముఖ్యంగా మాజీమంత్రి శ్రీనివాస గౌడ్ తదితరులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. బిసి కేడర్‌లో ఉత్సాహం నింపుతున్నారు. ప్రస్తుతం 1,686 పంచాయతీలు, 800 ఎంపీటీసీ, 77 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. గతంలో వనపర్తి జిల్లాలో 255 పంచాయతీలు ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 268కి చేరింది. ఏదుల నూతన మండలం ఏర్పాటు కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని కొన్ని గ్రామాలను ఏదుల మండలంలో విలీనం చేశారు. అలాగే ఏదుల జడ్పీటీసీ స్థానం కూడా కొత్త మండల ఏర్పాటుతో పెరిగింది. జోగులాంబ గద్వాల జిల్లాలో కూడా కొత్తగా ఎర్రవల్లి జడ్పీటీసీ స్థానం పెరిగింది. నారాయణపేట జిల్లాలో కొత్తపల్లి, గుండుమాల్ జడ్పీటీ-సీ స్థానాలు కొత్తగా అయ్యాయి. కొత్త మండలాలు, పంచాయతీలకు అనుగుణంగా ఓటర్ జాబితాను సిద్ధం చేశారు. కొన్ని కొత్తగా మునిసిపాలిటీలుగా ఏర్పడగా.. వాటి పరిధిలోకి కొన్ని పంచాయతీలను విలీనం చేయనున్నారు. వాటికి మునిసిపాలిటీలతో పాటే ఎన్నికలు జరగనున్నాయి. ఇవన్నీ లెక్కలు వేసుకుని బిఆర్ఎస్ నేతలు కదులుతున్నారు. ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుని సాగనున్నారు. ఇప్పటికే గ్రామాల వారీగా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

# చేపల వేటలో శిక్షణ దరఖాస్తులకు ఆహ్వానం

**విజయవాడ,జూలై15(సమయజ్యోతి):**

బాదంపూడిలో గల దేశీయ జల మత్స్య సంవర్ధన శిక్షణా కేంద్రంలో చేపల వేటలో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందే అభ్యర్థులు తమ పేరు, చిరునామా, పుట్టిన తేదీ విద్యార్హతలు అనుభవము మొదలగు వివరాలు తెలుపుతూ ధరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోగా సమర్పించాలి. దీనిని మత్స్యశాఖ సహాయ సంచాలకులు, బాదంపూడి, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా వారికి చేరే విధంగా పంపవలసిందిగా జిల్లా మత్స్య శాఖ అధికారి బి. నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ?శిక్షణ పొందుటకు ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాలోని, మత్స్యకారులు, యువకులు, జాలరులు, సహకార సంఘముల సభ్యులు చేపల పెంపకం నందు ఆసక్తి కలిగిన ఇతరులు, షెడ్యూల్డ్ కులములు మరియు షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు అర్హులు. ఉపకార వేతనము లేకుండా 20 సీట్లు కలవు, ఇంటర్వ్యూలు 29 న ఉదయం 11.00 గంటలకు మత్స్య శాఖ సహాయ సంచాలకులు, బాదంపూడి వారి కార్యాలయములో నిర్వహించబడును. ఇంటర్వ్యూలో ఎంపికైన వారి పేర్లు అదే రోజు సాయంత్రం 4.00 గంటల తర్వాత కార్యాలయము నోటీసు బోర్డులో ఉంచుతారు. మూడు మాసముల శిక్షణా కాలము ఆగస్ట్ 1నుండి అక్టోబర్ 31 వరకు ఉంటుంది. శిక్షణా కాలములో మత్స్య క్షేత్రములు మరియు రిజర్వాయర్లల్లో చేపలు పెంపకము గురించి బోధన మరియు ప్రాక్టికల్ తో కూడిన కోర్సు భోదించబడును. శిక్షణాంతరము పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు- అందించబడును. 5 వ తరగతి ఆ పైన చదువుకున్న వారికి ప్రాదాన్యత, తెలుగులో చదడం, రాయడం తెలిసిన వారికి కూడా అవకాశము ఇవ్వబడుతుంది. 18-30 సంవత్సరములు మధ్య వయస్సు గల వారు అర్హులు, వారి అర్హతలు ఎంపిక కమిటీ- ప్రత్యేక పరిగణనలో వయస్సు పరిమితిని సడలించవచ్చును. సహాయ పరిశీలకులు మత్స్యశాఖ హోదాకు తగ్గకుండా మత్స్యశాఖ అధికార్ల నుండి పొందిన అనుభవం గల సర్టిఫికెట్లు- దరఖాస్తుతో జతపరిచి పంపవలయును. అభ్యర్థి బయోడేటాలు స్వదస్తూరి లేదా -టైప్ చేసిన దరఖాస్తులు గానీ 25వ తేదీ లోగా కార్యాలయానికి పంపాలి..

# ఉక్కు పరిశ్రమల ఏర్పాటుకు అడుగేయాలి

## నిరుద్యోగ యువతకు భరోసా కల్పించాలి

**కడప,జూలై15(సమయజ్యోతి):**

స్థానిక వనరులతో పరిశ్రమలు స్తాపిస్తే తప్ప దేశంలో లక్షలాదిగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కదు. కడప, బయ్యారం ఉక్కు కర్మాగారాల ఏర్పాటు విషయంలో మరోమారు ఆలోచన చేయాల్సిఉంది. అలాగే స్థానికంగా లభ్యమవుతున్న ముడిసరుకుని విదేశాలకు తరలించకుండా అడ్డుకోవాలి. కడప, బయ్యారం ఉక్కు కర్మాగారాల ఏర్పాటు సాధ్యం చేయాల్సిన అవసరం ఉంది. ఇంకా కాలయాపన చేయడం వల్ల ఎందరో యువత ఆశలను దెబ్బతీశారు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో అపారమైన ఇనుప ఖనిజ నిల్వలున్నాయనీ, అనంతపురం గనుల ఖనిజం నాణ్యత ఎక్కువనీ మెకాన్ సంస్థగతంలోనే నిర్ధారించింది. కడప ఉక్కు కర్మాగారానికి ఆ ఖనిజ నిక్షేపాలను కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతనూ తెలిపింది. వీటన్నిటి ఆధారంగా కడప ఉక్కు కర్మాగార ఏర్పాటు సాధ్యమేనని మెకాన్ సంస్థ సమర్పించిన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. ఇలాంటి విషయాల్లో కాలయాపన చేసి చివరికి చేతులెత్తేయడం ద్వారా బృహత్తర లక్ష్యాన్ని దెబ్బతీయడం కాకా మరోటి కాదు. ఇలా చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉన్న అవకాశాలను దెబ్బతీయడం తప్ప మరోటి కాదు. సామాన్య ప్రజలనేగాక న్యాయ వ్యవస్థనూ మోడీ సర్కారు పక్కదారి పట్టించందనే అనుకోవాలి. కడప ఉక్కు విషయంలో మోసాన్ని రాష్ట్ర ప్రజలు ముక్త కంఠంతో నిరసిస్తున్నారు. కడప ఉక్కుపట్ల కేంద్రం ఎంత ప్రతికూలంగా వుందో స్పష్టమవుతోంది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక నిధులు మూడేళ్లు మాత్రమే ఇచ్చి, తర్వాత నిలిపివేసింది. పోర్టు ఏర్పాటుకూ తిలోదకాలిచ్చింది. సంకుచిత స్వార్ధ రాజకీయ ప్రయోజనాలకు విరుద్ధంగా అభివృద్ధి సాగాలి. అప్పుడే ఉక్కు పరిశ్రమల ఏర్పాటు సాకారం కాగలదని స్థానిక లెఫ్ట్ నేతలు వాదిస్తున్నారు.

# రోహిత్ వేముల ఆత్మహత్యపై అనుచిత వ్యాఖ్యలు

## డిప్యూటి సిఎం భట్టికి బిజెపి అధ్యక్షుడు లీగల్ నోటీసులు

**హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి):**

తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు షాక్ ఇచ్చారు. రోహిత్ వేముల ఆత్మహత్మపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గానూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు లీగల్ నోటీసులు పంపించారు. బేషరతుగా మూడు రోజుల్లో క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణలు చెప్పని పక్షంలో క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని.. 25 లక్షలకు పరువు నష్ట దావా వేస్తానని హెచ్చరించారు. గతంలో కోర్టు ఇచ్చిన తీర్పు కాపీని బీజేపీ చీఫ్ తరపు న్యాయవాది అటాచ్ చేశారు. నాలుగు రోజుల క్రితం ఢిల్లీలో డిప్యూటీ- సీఎం మల్లు భట్టివిక్రమార్క బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుపైన సంచలన ఆరోపణలు చేశారు. ఏఐసీసీ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సెంట్రల్ యూనివర్సిటీ-ల స్థితిగతులపై మాట్లాడుతూ.. హెచ్‌సీయూ లో విద్యార్థుల ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రస్తుత రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రయత్నించారని ఆరోపించారు. బీజేపీ అధిష్ఠానం తెలంగాణ నూతన అధ్యక్షుడిగా రాంచందర్‌రావును ఎంపిక చేయడాన్ని తప్పుపడుతూ.. రోహిత్ వేముల హత్యకు కారకులైనవారికి బీజేపీ ప్రమోషన్లు ఇస్తోందంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాంచందర్‌రావు నియామకం ఎంత మాత్రం సమంజసం కాదని కామెంట్ చేశారు. దీనికి కౌంటర్‌గా మంగలశారం బీజేపీ చీఫ్ లీగల్ నోటీసులు పంపించారు.

# మంత్రి జూపల్లిని కలిసిన నిథమ్ డైరెక్టర్

**హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి):**

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ- మేనేజ్‌మెంట్ నిథమ్ డైరెక్టర్‌గా నియమితులైన ప్రొఫెసర్ వెంకట రమణ. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట రమణకు మంత్రి జూపల్లి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.



# స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు

## గవర్నర్ వద్దకు చేరిన ఆర్డినెన్స్ ముసాయిదా

**హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి):**

తెలంగాణ స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా రాజ్‌భవన్‌కు చేరింది. ఇటీవలే కేబినేట్ ఆమోదించిన రిజర్వేషన్ బిల్లుకు ఆర్డినెన్స్ తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో పంచాయతీరాజ్ చట్టంలో సవరణల ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు పంపించింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 క్లాజ్-ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఆ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలవుతాయని ఉంది. అందులో 50శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగిస్తూ సవరించాలని నిర్ణయించారు. పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు హైకోర్టు విధించిన గడువు సమీపిస్తున్నందున.. ఆర్డినెన్స్ ద్వారా చట్టసవరణ అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంచాయతీ రాజ్ శాఖ ఈ ఫైలును న్యాయశాఖ ఆమోదించిన తర్వాత మంత్రి, సీఎం ఆమోదంతో ప్రభుత్వం రాజ్‌భవన్‌కు ముసాయిదాగా పంపించింది. గవర్నర్ ఆమోదం పొందితే చట్టసవరణ అమల్లోకి రానుంది. దీనికి అనుగుణంగా డెడికే-టె-డ్ కమిషన్ స్థానిక సంస్థలకు రిజర్వేషన్లను సిఫార్సు చేయనుంది. వాటి ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించనుంది. పంచాయతీ ఎన్నికలను సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు గడువు విధించిన విషయం తెలిసిందే.

# బోధన్ మాజీ ఎమ్మెల్యేకు చుక్కెదురు

**హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి):**

బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని షకీల్ వేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. షకీల్‌పై పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని ఆయన తరఫున న్యాయవాది అన్నారు. అయితే, ఈ కేసులో అభియోగపత్రం దాఖలు చేయాల్సి ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. షకీల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.ప్రజాభవన్ ఎదురుగా ఉన్న బారికేడ్లను ఢీకొట్టిన ఘటనలో షకీల్ కుమారుడు సాహిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా.. సాహిల్‌ను కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నించారని షకీల్‌పై కూడా కేసు నమోదైంది.

# దేశవ్యాప్తంగా ఓటర్ల సమగ్ర సవరణ

## -పలు సూచనలు చేస్తూ టిడిపి వినతిపత్రం-ఢిల్లీలో ఇసిని కలిసిన పార్టీ నేతలు

న్యూఢిల్లీ,జూలై15(సమయజ్యోతి): సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో అన్ని పార్టీల సూచనలు తీసుకుంటున్నామని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. బీహార్ లో ఈసీ సంస్కరణలను టీడీపీ బృందం స్వాగతించింది. గంట సేపు కేంద్ర ఎన్నికల కమిషనర్‌లతో టీడీపీ నేతలు చర్చించారు. ఆగస్టు - జనవరి మధ్య ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ జరుగ నుందని సీఈసీ తెలిపారు. ఓటర్ల జాబితా పారద ర్శకంగా రూపొందించాలని పార్టీ ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. అపో హలకు చోటులేకుండా సంస్క రణలు అమలు చేయాలని సూచించారు. ప్రత్యేక యాప్ ద్వారా ఓటరు జాబితా సవరణ చేయాలని శ్రీకృష్ణదేవ రాయలు కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం త్వరలో దేశ వ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించనున్న నేపథ్యంలో సీఈసీకి తెలుగుదేశం పార్టీ 7 సూచనలు చేసింది. దిల్లీలో సీఈసీని కలిసిన తెదేపా నేతల బృందం ఈమేరకు పార్టీ తరఫున వినతి పత్రం అందించింది. ఎస్‌ఐఆర్‌ను ఏపీలో అమలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ధ్రువపత్రాల విషయంతో పాటు- ఓట్ల తొలగింపుపై ప్రజల్లో నెలకొన్న అపోహలపై సందేహాలను లేవనెత్తింది. ఎస్‌ఐఆర్ వల్ల ఎలాంటి నష్టం వాటిల్లదని, ఎవరి ఓట్లు- తొలగించబోమని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని తెదేపా నేతలు తెలిపారు. తెదేపా ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, లావు శ్రీకృష్ణదేవరాయలు, కూన రవికుమార్ తదితరులు సీఈసీని కలిసిన వారిలో ఉన్నారు. ఓటర్ల జాబితా ధ్రువీకరణను బలోపేతం చేయాలని,కాగ్ ఆధ్వర్యంలో ఏడాదికోసారి థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించాలి. ఓటర్ల జాబితా రూపొందించడంలో ఏఐ సాయం తీసుకోవాలని టిడిపి సూచించింది. ఆధార్ సహాయంతో నకిలీ ఎపిక్ నంబర్లను గుర్తించాలని,. ఇంక్ ఆధారిత ధ్రువీకరణ స్థానంలో బయోమెట్రిక్ వెరిఫికేషన్ ప్రక్రియను అమలు చేయాలన్నారు. ఓటర్ల జాబితా సవరణలో అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లను భాగస్వాములను చేయాలి. డ్రాఫ్ట్ రోల్స్‌ను ముందస్తుగా బీఎల్‌ఏలతో పంచుకోవడాన్ని తప్పనిసరి చేయాలని కోరింది. ఓటర్ల చేర్పులు, తొలగింపులకు సంబంధించి జిల్లాల వారీ డేటాను కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అందుబాటు-లో ఉంచాలి.. దీనివల్ల పారదర్శకతతో పాటు- ప్రజలు సులభంగా చెక్ చేసు కోవచ్చని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎన్నికల సిబ్బందిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం, జరిమా నాలు విధించడం చేయాలి. స్థానిక పరి స్థితుల ప్రభావం ఎన్నికలపై పడకుండా బీఎల్ వోలు, ఈఆర్వోలను తరచూ మారు స్తుండాలని అన్నారు. వలసదారులు, గిరిజన తెగలకు చెందిన వారు, నిరాశ్రయులైన వారి పేర్లను తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలి. దీనికోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని టిడిపి తెలిపింది. ఓటర్ల జాబితాపై సంప్రదింపులు, పర్య వేక్షణకు ప్రతి నెలా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో జిల్లా, నియోజకవర్గ ఎన్నికల అధికారులు సమావేశాలు నిర్వహించాలనికూడా నేతలు సూచించారు.

# వైకాపా ఎంపి మిథున్ రెడ్డికి షాక్

## ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ

అమరావతి,జూలై15(సమయజ్యోతి):



మద్యం కేసులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో మిథున్‌రెడ్డి ఏ4 నిందితుడిగా ఉన్నారు. రాష్ట్రంలో మద్యం ఆర్డర్లు, సరఫరా వ్యవస్థ గతంలో ఆన్‌లైన్ పద్ధతి ద్వారా పారదర్శకంగా ఉండేదని, వైకాపా ప్రభుత్వ హయాంలో దానిని మాన్యువల్ విధానంలోకి తీసుకురావడంలో ఆ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని సీఐడీ తెలిపింది. తనను పోలీసులు అరెస్ట్ చేయకుండా ఉండేందుకు ముందస్తు బెయిల్ కోసం మిథున్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఆ పిటిషన్ పై కీలక నిర్ణయం తీసుకున్న ధర్మాసనం.. మిథున్ రెడ్డి బెయిల్ పిటీషన్ ను డిస్మిస్ చేసింది. మద్యం కుంభకోణం విచారణ కీలక దశలో ఉన్నందున ఇప్పుడు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. దీంతో త్వరలో ఈ కేసులో మిథున్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది.

# భిన్నత్వంలో ఏకత్వమే మన విధానం

## -జాతీయ సమగ్రత, భాషా సామరస్యం ముఖ్యం- పవన్ హిందీ భాషా వ్యాఖ్యలపై జనసేన వివరణ

అమరావతి,జూలై15(సమయజ్యోతి): భిన్నత్వంలో ఏకత్వం, జాతీయ సమ గ్రత, భాషా సామ రస్యంపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆలోచన విధానమని జనసేన స్పష్టం చేసింది.. హైదరాబాద్‌లో నిర్వహించిన రాజ్య భాష విభాగం స్వర్ణోత్సవ వేడుకల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.. అయితే, దీనిపై జనసేన పార్టీ స్పందించింది.. మాతృభాషకు ప్రథమ ప్రాధాన్యత.. సమాజంలో మన గుర్తింపుకు మూలం మాతృ భాషే అని స్పష్టం చేసింది జనసేన. బాల్యంలో విద్యాభ్యాసానికి, మన సంస్కృ తులను కాపాడుకోవడానికి మాతృభాష తప్పని సరిగా ఉండాలన్నది పవన్ అభిప్రా యమని తెలిపింది. బహు భాషా ప్రావీణ్యం జీవితంలో ఎదిగేందుకు ఒక సాధనం అని పేర్కొన్నారు.. అది జ్ఞానాన్ని అందించడమే కాకుండా, భిన్న సంస్కృతుల ప్రజలతో మమేకం అయ్యేం దుకు, అవకాశాలను మెరుగుపరచేందుకు తోడ్పడుతుందని పేర్కొంది. అన్ని భాషలను గౌరవించాలి.. ఏ భాషను బలవంతంగా రుద్దవద్దని పవన్ కల్యాణ్ అన్నారని జనసేన స్పష్టం చేసింది. ప్రతీ భాషకు సముచిత గౌరవం ఇవ్వటం కనీస బాధ్యత. భాషను గౌరవిస్తూ, అది ప్రజలను కలిపే వారధిగా పనిచేస్తుందని పార్టీ స్పష్టం చేసింది. భాషను బలవంతంగా రుద్దితే అది ప్రజలను విడదీస్తుందన్న అభిప్రాయాన్ని వెల్లడించింది. హిందీని బలవంతంగా రుద్దడం లేదు.. కానీ, హిందీ వల్ల ప్రయోజనాలు అనేకం అని తెలిపింది. హిందీ భాషను ఖచ్చితంగా నేర్చుకోవాలనే విధానానికి పవన్ కల్యాణ్ ఎప్పుడూ వ్యతిరేకమే. అయితే, ఉద్యోగ అవకాశాల కోసం, విభిన్న ప్రాంతాల ప్రజలతో మమేకం అయ్యేందుకు హిందీని నేర్చుకోవడం వల్ల ఫలితాలే తప్ప నష్టం ఏమీ లేదని పార్టీ పేర్కొంది. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ అస్తిత్వం. భాషా వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడం ద్వారా భారతదేశం మరింత సమగ్రాభివృద్ధిని సాధించగలదని, ఫెడరల్ స్ఫూర్తిని కాపాడగలదని పవన్ కల్యాణ్ అభిప్రాయం అని జనసేన తెలిపింది..

# యూట్యూబ్ శిక్షణతో బైకు దొంగతనాలు

## ఏడుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల అరెస్ట్

ఒంగోలు,జూలై15(సమయజ్యోతి): యూట్యూబ్ చూసి బుల్లెట్ బైక్‌ల తాళాలు ఎలా తీయాలో నేర్చుకొని దొంగతనాలకు పాల్పడిన ఏడుగురు ఇంజనీరింగ్ విద్యార్థులను బాపట్ల జిల్లా అద్దంకి పోలీసులు అరెస్టు చేశారు. జల్సాలకు అలవాటు పడ్డ వీరు దొంగతనాలకు అలవాటు పడ్డారు. వీరిలో ఆరుగురు నిందితులు ఒంగోలులో, మరొకరు కందుకూరులో బీటెక్ చదువుతున్నట్లు- గుర్తించారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు 16 బుల్లెట్ బైక్‌లు, ఒక స్కూటీని దొంగిలించినట్లు- దర్యాప్తులో తేలింది. వీటి విలువ సుమారు రూ.25.20 లక్షలుగా ఉన్నట్లు- పోలీసులు అంచనా వేశారు. బుల్లెట్ వాహనాలు చోరీకి గురయ్యాయని అద్దంకిలో 9 కేసులు, నరసరావుపేటలో 1, మద్దిపాడులో 1, చిలకలూరిపేటలో 2, జె.పొంగులూరులో 2 కేసులు నమోదయ్యాయి. కేవలం బుల్లెట్ వాహనాలే దొంగతనానికి గురవడంతో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తీవ్రంగా పరిగణించారు. అద్దంకి సీఐ సుబ్బరాజు నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు- చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుల ఆచూకీ తెలుసుకున్నారు. అద్దంకి పట్టణానికి సమీపంలో పార్కు చేసిన 16 బుల్లెట్ బైక్‌లు, ఒక స్కూటీని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో పోలీసుల బృందం గుర్తించి స్వాధీనం చేసుకుంది. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

# నదుల అనుసంధానానికి ఆద్యులు కెఎల్ రావు

## -ఆయన మార్గాన్ని అనుసరిస్తున్న చంద్రబాబు-కెఎల్ రావు జయంతి కార్యక్రమంలో మంత్రి నిమ్మల

విజయవాడ,జూలై15(సమయజ్యోతి) ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారని.. అయితే 50 ఏళ్ల క్రితమే నదుల అనుసందానికి నాంది పలికింది కేఎల్ రావు అని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు గుర్తు చేసుకున్నారు.కేఎల్ రావు స్ఫూర్తిని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారని తెలిపారు. నాగార్జున సాగర్, శ్రీశైలం, హిరాకుడ్ సహా దేశంలో అత్యంత భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి కేఎల్ రావు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ప్రఖ్యాత ఇంజినీర్ కేఎల్ రావు తెలుగువారు కావడం గర్వకారణమని కొనియాడారు. ప్రఖ్యాత ఇంజినీర్ డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి సందర్భంగా కేఎల్ రావు చిత్రపటానికి మంత్రి నిమ్మల నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కరవుతో వచ్చే దుర్భిక్ష పరిస్థితులు పారద్రోలాలంటే నదుల అనుసందానమే మార్గమని స్పష్టం చేశారు. ఏటా 3 వేల టీఎంసీల వరద నీరు సముద్రం లోకి పోకుండా పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు నిర్మిస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు విధ్వంసానికి గురైందని మండిపడ్డారు. ప్రశ్నార్థకమైన పోలవరం ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిందని అన్నారు. 2027 డిసెంబర్ కల్లా పోలవరం ప్రాజెక్టును పూర్ తిచేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టిసీమ కాదు.. వట్టిసీమ అని గతంలో శాసనసభలో జగన్ అవహేళన చేశారని.. చంద్రబాబు కృషి పట్టు-దలతో పట్టిసీమ పూర్తి చేయడంతో కృష్ణాడెల్టా సస్యశ్యామలం అవుతోందని వెల్లడించారు. ఈ ఏడాది కృష్ణా డెల్టాలో వర్షాలు ఆశించినంతగా కురవ లేదన్నారు. ఎగువ ప్రాజెక్టులు నిండక పోయినా పట్టిసీమ నీరుతో కృష్ణా డెల్టా కళకళలాడుతోందని చెప్పుకొచ్చారు. విజయ వాడలో నీలం రంగులో ప్రవహించే కృష్ణమ్మ .. గోదారమ్మ కలవడంతో ఎరుపురంగు పులుముకుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ సాగునీటి ప్రాజెక్టులపై తీవ్ర నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస నిర్వహణ లేకపోవడంతోనే గతంలో పులిచింతల గేట్లు- కొట్టు-కుపోయాయని వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సాగునీటి ప్రాజెక్టులను నిర్వహణ, మరమ్మ తులకు నిధులిచ్చామన్నారు. ప్రజలిచ్చిన అధికారంతో ఒళ్లు దగ్గర పెట్టు-కుని పనిచేస్తున్నా మన్నారు. ఈ ఏడాదిలో ఉత్త రాంధ్రకు పోలవరం ద్వారా నీరు తీసుకు రావడమే లక్ష్యమని స్పష్టం చేశారు. హంద్రీనీవా ప్రవాహం 2100 క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కుల ప్రవాహం పెంచేలా ఏడాదిలోనే కాలువలు వెడల్పు చేశామన్నారు. స్ఫూర్తి నిచ్చేలా పనిచేయడమే కెఎల్ రావుకు ఇచ్చే ఘనమైన నివాళి అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# పర్యాటకంగా పోలవరం, కొల్లేరు అభివృద్ధి: నాదెండ్ల

ఏలూరు,జూలై15(సమయజ్యోతి): ఏలూరు జిల్లాలో అద్భుతమైన వనరులు ఉన్నాయని, మౌలిక వసతులు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంజాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల నుంచి నిధులు తీసుకొచ్చి రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. పోలవరం, కొల్లేరును పర్యటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశముందన్నారు. జిల్లాల్లో పర్యటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# గగన్‌యాన్‌కు శుభాంశు శుక్లా అనుభవం జోడింపు

## ఇస్రో సంస్థ వెల్లడి

న్యూఢిల్లీ,జూలై15(సమయజ్యోతి): యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఐఎస్‌ఎస్ వెళ్లి క్షేమంగా తిరిగి వచ్చారు. 18 రోజుల పాటు ఆయన అంతరిక్షంలో గడిపారు. దీనిపై భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో స్పందించింది. ఐఎస్-ఎస్‌లో ఉన్న సమయంలో శుక్లా సొంతం చేసుకున్న అనుభవం గగన్‌యాన్ మిషన్‌కు ఎంతో కీలకం కానుందని ఇస్రో స్పేస్ అప్లికేషన్ సెంటర్ డైరెక్టర్ నీలేశ్ ఎం దేశాయ్ అభిప్రాయపడ్డారు. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ.. ఈ యాత్ర విజయంతో రోదసిరంగంలో భారత్ శాశ్వత స్థానాన్ని ఏర్పరచుకుంది. ఇది యావత్ ప్రపంచానికి గర్వకారణం. ఈ క్షణం భారత్‌కు మాత్రం అత్యంత ప్రత్యేకమైనదని హర్షం వ్యక్తంచేశారు. ఇదిలా ఉంటే.. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో ఇస్రో ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్‌ను చేపట్టిన విషయం తెలిసిందే. భారత అంతరిక్ష కార్యక్రమాల్లో ఇది కీలకం కానుంది. ఈ క్రమంలో చేపడుతున్న పరీక్షలు విజయవంతం అవుతున్నాయి. ఈ గగన్‌యాన్ ప్రాజెక్టు ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేయనుంది. గగన్‌యాన్ యాత్రను 2027 తొలి త్రైమాసికంలో చేపట్టే అవకాశాలు ఉన్నట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ ఇటీవల వెల్లడించారు.రోదసిలో 18 రోజులు గడిపి, మానవాళికి ప్రయోజనం కలిగించే అనేక ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించిన శుక్లా బృందం.. మంగళవారం మధ్యాహ్నం 3.01కి కాలిఫోర్నియా సముద్ర తీరంలో దిగింది. భూమికి తిరిగి రావడం సంతోషంగా ఉందని యాక్సియం-4 కమాండర్ పెగ్గీ విట్సన్ పేర్కొన్నారు.

# ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసే లక్ష్యం

## -వ్యాపార నైపుణ్యాలు వెలికితీసి ప్రోత్సహిస్తాం-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్

అమరావతి,జూలై15(సమయజ్యోతి): మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేసి వారు గొప్ప వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని పుర పాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి లైవ్లీ హుడ్స్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంను తాడేపల్లిలోని ఓ ప్రైవేటు కన్వేన్షన్ లో మంగళవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. వారిలో దాగున్న వ్యాపార నైపుణ్యాలను వెలికితీసి వారిని బలమైన వ్యాపారవేత్తలుగా తయారు చేయడానికి మెప్మా చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 30వేల మందికి పైగా మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళు తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల నుంచి రుణం తీసుకుని చిన్న చిన్న వ్యాపార సంస్థలు నెలకొల్పి అంచెలంచెలుగా రూ. కోటి టర్నోవర్ సాధించే సంస్థలుగా రూపాంతరం చెందేలా వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమం ద్వారా ఈ ఏడాదిలో రాష్ట్ర మంతా ఆడిట్ నిర్వహించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని సురేష్ కుమార్ అన్నారు. మహిళలు చాలా మంది ఆడిట్ లో పాల్గొంటే తమ కుటుంబాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందవన్న అపోహ లో ఉన్నారని, అది వాస్తవం కాదని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో పేదరికాన్ని శాశ్వతంగా దూరం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుం దన్నారు. నేడు మన సొసైటీలో ఎన్నో విధాలుగా ఆదాయం పొందే మార్గాలు ఉన్నా యని, అవకాశాలను అందిపుచ్చు కోవాలన్న సంకల్పం ఉండాలన్నారు. ఉదాహరణకు కుకింగ్, వివిద అంశాలపై అవగాహన కల్పించే వీడియోలు సైతం ఆదాయాన్ని సమకూర్చుతాయన్నారు. మన గ్రామంలో, మన పట్టణంలోనే సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ పై శిక్షణ పొంది ఆదాయం ఆర్జించవచ్చన్నారు. మెప్మా ఎండీ ఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి, వారిని సంఘంలో ఒక గుర్తింపు కలిగిన వ్యాపారవేత్తలుగా తయారు చేయడానికి మెప్మా సిబ్బంది శక్తి వంచన లేకుండ పనిచేయాలని పిలుపు నిచ్చారు. మహిళలకు రుణాలు ఇప్పించడం తో బాధ్యత తీరిపోయిందనుకోకూడదని, వారి వ్యాపార ఉన్నతికి తమ వంతు సలహాలు, సహాయ సహకారాలు అందించా లన్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయ వాడ, తిరుపతి కార్పొరేషన్ లలో రఊఆ ఆడిట్ చివరి దశకు వచ్చిందని, మిగిలిన 14 కార్పొరేషన్ లలో కూడా ఆడిట్ ను త్వరలోనే నిర్వహిస్తామని, అటు-పై మన్సిపాల్టీలు, నగర పంచాయితీలలో దశల వారీగా నిర్వహిస్తామన్నారు. ఆడిట్ అంటే వ్యాపారంలో ఉన్న మహిళలకు మరింత మెళుకువలు అందించడం, వారిని ప్రోత్సహించడం వంటివి ఉంటాయని వివ రించారు. మెప్మా సిబ్బంది సాధించిన విజ యాలను మెమొంటల రూపంలో సంతృప్తి పడరాదని, మహిళా వ్యాపా రవేత్తలు సమర్థవంతంగా తమ వ్యాపా రాలను నిర్వహించేలా వారికి వెన్నుదన్నుగా నిలచినప్పుడే సంతృప్తి చెందాలని కోరారు. స్వయం సహాయక సంఘాల నుంచి రుణం తీసుకుని వ్యాపారాన్ని ప్రారంభించి అభివృద్ధిలోకి వచ్చిన పలువురు మహిళా వ్యాపారవేత్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. విజయవాడకు చెందిన దీప్తి రెడ్డి వ్యాపార విస్తరణలో తన అభివృద్ధిని వివరిస్తూ ద్వాక్రా రుణం రూ. 2లక్షలతో బొటిక్ ను ప్రారంభించానని ఇప్పుడు 12 మందికి తానే ఉపాధి చూపించగలుగు తున్నానని, దాదాపు నెలకు రూ. 5లక్షలు సిబ్బందికి జీతాలు ఇచ్చే స్థాయికి చేరుకున్నానని గర్వంగా తెలిపారు. అలాగే విజయవాడకు చెందిన మరో వ్యాపారవేత్త రమాదేవి మాట్లాడుతూ సెమీ కుకింగ్ చపాతి పరిశ్రమ స్థాపించి నెలకు స్థిర ఆదాయం పొందుతున్నానని సంతోషం వెలిబుచ్చారు. విజయవాడకు చెందిన మరో మహిళా వ్యాపారవేత్త హైమా మాట్లాడుతూ చీరల మాన్యూఫాక్చరింగ్ యూనిట్ ను ద్వాక్రా రుణం రూ. 60వేలతో ప్రారంభించానని ఇప్పుడు రూ. 3కోట్ల టర్నోవర్ కు చేరుకున్నానని వివరించారు.




కార్యక్రమంలో ఇండియా ఎస్‌ఎంఈ ఫోరమ్ ప్రెసిడెంట్ శ్రీ వినోద్ కుమార్, భారత ఎస్‌ఎమ్‌ఈ ఫోరం డైరెక్టర్ జనరల్ శ్రీమతి సుష్మ మోర్తానియా, మెప్మా అడిషనల్ మిషన్ డైరెక్టర్ శ్రీ నాగ వేంకటేశ్వరరావు కోటిపల్లి గారు అన్ని జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్లు,. భారత ఎస్‌ఎమ్‌ఈ ఫోరం డైరెక్టర్ - శిక్షణ, నైపుణ్యం మరియు ఇంక్యూబేషన్ శ్రీమతి భవ్య శర్మ మెప్మా సిటీ- మిషన్ మేనేజర్లు, సీఓలు, ఊః- రఐలు మరియు ఎస్‌ఎంఎంలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శ్రీధర్ బాబుతో ఫ్రాన్స్ కాన్సూల్ జనరల్ భేటీ

హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి): డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ-, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మంగళవారం బెంగళూరులోని ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్, అడ్మినిస్ట్రేటర్ ఆఫ్ ది స్టేట్ మార్క్ లామీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో తెలంగాణ - ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు సహా ఇరుపక్షాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, వివిధ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు. టీ-జీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడి అరికట్టాలి

## 23న విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల పిలుపు

**హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి):**

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు– వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని వారు డిమాండ్ చేశారు. మంగళ వారం విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన హిమాయత్ నగర్ లోని ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి అనిల్, జాతీయ నాయకులు మహేష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఎఐడిఎస్ఓ నేత నితీష్, ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్ ,కిరణ్ పిడిఎస్‌యు నాయకులు హరీశ్ నవీన్,శ్రీను,ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు. ప్రైవేటు–, కార్పొరేటు– విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని, విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని, ఖాళీగా ఉన్న టీ–చర్, ఎంఈఓ,డిఈఓ పోస్టులను భర్తీ చెయ్యాలని, ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న బోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్ షిప్ లను విడుదల చేయాలని, అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించి,నిధులు కేటాయిం చాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకా యిలు విడుదల చెయ్యాలని, విద్యార్థులకు ఆర్టిసిలో ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, ఎన్ఈపి 2020 తెలంగాణలో అమలు చెయ్యకుండా అసెంబ్లీలో తీర్మానం చెయ్యాలని సమావేశం డిమాండ్ చేసింది.

# పివి ఆర్థిక సంస్కరణలు దేశానికి గేమ్ ఛేంజర్

## –దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలు భారత్ గతిని మార్చాయి
## –బహుహభాషా వేత్తయే కాకుండా గొప్పరాజనీతిజ్ఞుడు
## –పివి కృషితోనే దేశంలో ఐటి విప్లవం సాధ్యమయ్యింది
## –పివి ఆర్థిక విధానాలపై చంద్రబాబు ప్రశంసలు

**న్యూఢిల్లీ,జూలై15(సమయజ్యోతి):**

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గొప్ప రాజనీతిజ్ఞుడని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పివి తీసుకుని వచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశానికి గేమ్ ఛేంజార్‌గా ఆర్థికరంగానికి ఊతంగా నిలిచాయని అన్నారు. దేశానికి అనేక రంగాల్లో పీవీ నరసింహారావు సేవలందించారు. ఆర్థిక సంస్కరణలు అంటే గుర్తొచ్చేది పివియేనని అన్నారు. లైసెన్స్‌రాజ్ నిబంధనల నుంచి దేశాన్ని బయటకు తెచ్చారు. 1990ల్లో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. సరైన విధానాలు లేక అస్తవ్యస్తంగా ఉండేది. ఆ సమయంలో పీవీ దూరదృష్టితో ఆర్థిక విధానాలను అమలు చేశారు. ఆయన ప్రధాని అయ్యాక దేశ ఆర్థిక సంస్కరణలు కొత్తరూపు సంతరించుకుని గేమ్ ఛేంజర్‌గా మారాయి. పీవీ నరసింహారావు కృషితోనే ఐటీ విప్లవం వచ్చిందని చంద్రబాబు అన్నారు. ఉమ్మడి ఏపీ అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో ఉందని చెప్పారు. 17 భాషలు నేర్చుకున్న పీవీ.. ప్రధాని, కేంద్రమంత్రి, సీఎంగా సేవలందించారని గుర్తుచేశారు. దిల్లీలో నిర్వహించిన లెక్చర్ సిరీస్ ఆరో ఎడిషన్ కార్యక్ర మానికి సీఎం హాజరయ్యారు. 'లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ పీవీ' అంశంపై ఆయన మాట్లాడారు. మైనారిటీ– ప్రభుత్వంలోనూ పీవీ చాలా లౌక్యంగా వ్యవహరించారు. పీవీ తెచ్చిన సంస్కరణలను వాజ్‌పేయీ కొనసాగించారు. వాజ్‌పేయీ హయాంలో హైవేలు, విమానాశ్రయాలు, పోర్టులు వచ్చాయి. 2014లో మోదీ ప్రధాని అయిన తర్వాత ఆయన కూడా అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. మోదీ హయాంలో భారత్ పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోంది. అనేక దేశాలతో ఆయన మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు. సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్ పేరుతో ముందుకెళ్తున్నాం అని చంద్రబాబు అన్నారు. నేను చాలా అదృష్టవంతుడిని.. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతో కలిసి పనిచేసే అవకాశం లభించిందని చంద్రబాబు నాయుడు గుర్తుచేసుకున్నారు.. పీవీ భారత ముద్ద బిడ్డ, భారత రత్న.. అసలుసిసలు తెలుగు బిడ్డ అని కీర్తించారు.. ఆయనతో నాకు మంచి సన్నిహిత సంబంధాలు ఉండేవని గుర్తుచేసుకున్నారు.. 17 భాషల్లో పీవీ నిష్ణాతుడు.. కానీ, ప్రస్తుతం హిందీ భాష నేర్చుకోవడం పై పెద్ద రాద్దాంతం చేస్తున్నాం అని విమర్శించారు. ఎంతో సంయమనం, ఆలోచనపరమైన దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు పీవీ అంటూ కొనియాడారు. గతంలో భారత ఆర్థికాభివృద్ధి రేటు– 3 నుంచి 5 శాతం ఉండేది.. గతంలో భారత దేశానికి చెందిన బంగారాన్ని తాకట్టు– పెట్టే పరిస్థితుల్లో ఉన్నాం.. పిల్లి రంగు నలుపా, తెలుపా అనే వ్యత్యాసంతో చూడరాదు.. ఎలుకను పట్టుకునే పిల్లి అయితే చాలు అన్నారు చంద్రబాబు.. సంక్షోభాన్ని ఒక అవకాశంగా తీసుకోవాలి. సరిగ్గా అదే చేశారు పీవీ నరసింహారావు అని తెలిపారు.. 1991లో దివంగత పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలాలను ఇప్పుడు దేశ ప్రజలంతా అనుభవిస్తున్నారు.. అన్ని పార్టీల మధ్య రాజకీయ ఏకాభిప్రాయం సాధించడంలో అసాధారణ ప్రతిభాశాలి పీవీ అంటూ ప్రశంసలు కురిపించారు చంద్రబాబు. 2014లో ప్రపంచంలో 11వ ఆర్థిక శక్తిగా భారత్ ఉంది.. 2028 కల్లా భారత్ మూడవ ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తామన్న విశ్వాసం నాకు ఉందన్నారు చంద్రబాబు.. 2047 కల్లా భారత్ ప్రపంచంలోనే నెంబర్ 1 ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తామనడంలో ఏమాత్రం సందేహం లేదన్నారు.. 1991లో పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు అమలు చేయడం ప్రారంభించారు.. అప్పట్లో 3 నుంచి 4 వరకు భారత్ ఆర్థికాభివృద్ధి రేటు ఉండేది.. ప్రస్తుతం భారత్ ఆర్థికాభివృద్ధి రేటు– 6 నుంచి 7 వరకు ఉంది. 2047 కల్లా భారత్ వృద్ధి రేటు– 10కి మించి ఉంటుందనే నమ్మకాన్ని చంద్రబాబు నాయుడు వ్యక్తం చేశారు.

# నేటి జలశక్తి మంత్రి భేటీ ఉంటుందా?

## –జలవివాదాలపైనే తెలంగాణ ఫోకస్
## –బనకచర్లపై ఎపి ప్రభుత్వం పట్టు
## –తెలంగాణ లేఖతో సమస్య జటిలం

**న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై15(సమయజ్యోతి):**

ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు కేంద్రంపై పరోక్షంగా ఒత్తిడిపెంచి ఒక్కో పనిని సానుకూలం చేసుకుంటున్నారు. ఈక్రమంలో బనకచర్లపై తెలంగాణను ఒప్పించేందుకు కేంద్రంతో భేటీ ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో బనక చర్లపై నేరుగా చర్చ అని చెప్పకుండా జల వివాదాలపై అంటూ..కేంద్రమంత్రి పాటిల్ ఇరు రాష్ట్రాల సిఎంల భేటీకి నేడు ఆహ్వా నించారు. అయితే ఈ ఎత్తుగడను ముందే పసిగట్టిన తెలంగాణ ఈ భేటీలో జలవివాదాలు తప్ప బపనకచర్లపై చర్చుండరాదని మెలికపెట్టి లేఖ రాసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారంలో కృష్ణా, గోదావరి జలాల గురించి మాత్రమే చర్చించాలని కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది చేయకుండా కేవలం బనకచర్లపై చర్చించడం కుదరదని తేల్చిచెప్పింది. దీంతో కేంద్రం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను చర్చకు ఆహ్వానించిన క్రమంలో ఈ సమావేశం ఉంటుందా లేదా అన్నది అనుమానంగా మారింది. ఇరు రాష్ట్రాల మధ్యజలవివాదాల పరిష్కారం కోసం అంటూ బుధవారం తెలంగాణ, ఎపి సిఎంలు కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కేంద్రానికి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. సమా వేశంలో బనకచర్లపై చర్చించాలని ఎపి సింగిల్ ఎజెండా ఇచ్చింది. అయితే నేటి భేటీలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం తన లేఖలో పేర్కొంది. కృష్ణాపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను ప్రభుత్వం అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, డిండి ప్రాజెక్టులకు జాతీయహోదాను ప్రభుత్వం అజెండాగా పంపించింది. ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని ప్రభుత్వం కోరింది. గోదావరి– బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల సీఎంలకు పిలుపు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై అభ్యంతరం తెలిపింది. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే నేటి సమావేశంలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు విషయమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి లతో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఈ నెల 16న బుధవారం సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ మేరకు జలశక్తిశాఖ ఇరు రాష్ట్రాలసీఎంల కార్యాలయాలు, సీఎస్‌లకు సమాచారం పంపించింది. దిల్లీలోని జలశక్తిశాఖ ప్రధాన కార్యాలయం శ్రమశక్తి భవన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం జరుగుతుంది. ఈ అంశంతోపాటు– రాష్ట్రాల తరఫున మాట్లాడాల్సిన ఇతర ఎజెండా పాయింట్లు– ఏమైనాఉంటే వెంటనే పంపాలని జలశక్తి శాఖ కోరింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఏపీ ప్రభుత్వం సింగిల్ అజెండా ఇచ్చింది. వాస్తవానికి ఈ నెల 11న సమావేశం నిర్వహించాలని నిర్ణయించి ముఖ్యమంత్రుల సమయం కోరినా, సానుకూల స్పందన రాక పోవడంతో 16వ తేదీకి వాయిదావేశారు. ఈ తేదీన హాజరుకావడానికి ఇద్దరు ముఖ్య మంత్రులు అంగీకరించినట్లు– తెలిసింది. కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, దిండి ప్రాజెక్టులకు జాతీయహోదా, ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని, తుమ్మడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీలు కేటాయించాలని అజెండాగా పంపించింది. 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని, చట్టాలు, –ట్రైబ్యునల్ తీర్పుల ఉల్లంఘన జరుగుతోందని లేఖలో ప్రస్తావించింది. గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించడం అనుచితమని పేర్కొంది. ఇలాంటి చర్యలతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థలపై నమ్మకం పోతుందని తెలిపింది.

ఏపీ పునర్విభజన చట్టం మేరకు కొత్త ప్రాజెక్టులు, జల వివాదాలకు సంబంధించిన అంశాలను కేంద్ర జలశక్తి మంత్రి ఛైర్మన్‌గా, రెండు రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా గల ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించాల్సి ఉంది. గత పదేళ్లలో రెండు సమావేశాలు జరిగాయి. ఇటీవల ఏపీ ప్రభుత్వం గోదావరి వరద జలాలను వినియోగించు కొనేందుకు బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఇప్పటికే దిల్లీలో కేంద్రమంత్రిని కలిసి అభ్యంతరం వ్యక్తంచేశారు. పర్యావరణ అనుమతులు, కేంద్ర జలసంఘం నుంచి అనుమతులు ఇవ్వొద్దంటూ లేఖలు రాశారు. గోదావరి–బనకచర్ల వల్ల తెలంగాణలోని ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ గట్టిగా వాదన వినిపిస్తున్న నేపథ్యంలో కేంద్ర మంత్రితో జరిగే సమావేశం ప్రాధాన్యం సంతరించుకొంది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఈ భేటీ ఉంటుందా అన్న అనుమానాలు వస్తున్నాయి.

# బిసిల్లో ముస్లింలకు చోటు తగదు

## దీనిపై బిజెపి త్వరలోనే ఉద్యమిస్తుంది: బండి

**కరీంనగర్,జూలై15(సమయజ్యోతి):**

తెలంగాణలో అమలు చేయనున్న 42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు ఇస్తే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. అదే జరిగితే అసెంబ్లీ లోపల, బయటా బీజేపీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. బీసీ జాబితా నుంచి ముస్లింలను తీసేస్తేనే మద్దతిస్తామని చెప్పారు. ముస్లింలకు బిసిల్లో చోటు కల్పించడం కేవలం ఓటుబ్యాంక్ రాజకీయలు తప్ప మరోటి కాదన్నారు. తెలంగాణలో12 శాతమున్న ముస్లిలంకు వంద శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారా.. 51 శాతమున్న బీసీలకు 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేయడమేంటని ప్రశ్నించారు. అలాగైతే బీసీలకు అదనంగా దక్కేది 5 శాతం మాత్రమేనని అన్నారు. అతి త్వరలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తామని తెలిపారు. బనకచర్లపై తెలంగాణ వాదనను గట్టిగా విన్పించాలని సీఎం రేవంత్ కు బండి సంజయ్ సూచించారు. బనకచర్ల విషయలో రాజకీయాలకు అతీతంగా సీఎంకు అండగా ఉంటామని వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు– చెప్పారు.

# మరో భర్తా హంతకురాలు పట్టివేత

## ప్రియుడితో కలసి భర్త హత్య

**యాదాద్రి భువనగిరి,జూలై15(సమయజ్యోతి)**

: సినీ ఫక్కీలో తన భర్తను హత్య చేయించిన భార్య చివరకు పోలీసులకు చిక్కారు. ప్రయియుడితో కలసి భర్తను హత్యచేయించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. కానీ పోలీసుల కళ్లుగప్పలేక పోవడంతో ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె ప్రియుడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. మరో నిందితుడు రామలింగస్వామి పరారీలో ఉండగా.. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటన కేసు వివరాలను డీసీపీ అక్షాంశ్ యాదవ్ వెల్లడించారు. ఇటీవల ఆత్మకూరు మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన స్వామి (38) హత్యకు గురయ్యాడు. భార్య స్వాతి తన ప్రియుడు సాయికుమార్, సోదరుడు మహేశ్‌తో కలిసి భర్తను చంపించింది. బైక్‌పై వెళ్తున్న స్వామిని కారుతో ఢీకొట్టించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించింది. స్వాతిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా హత్య విషయం బయటపడింది. స్వాతి, సాయికుమార్, మహేశ్‌పై పోలీసులు హత్యానేరం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి 3 ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

# బోనాలు, మొహర్రంలలో రెచ్చిపోయిన ఆకతాయిలు

## 478 మంది ఆకతాయిలను పట్టుకున్న షీ టీమ్స్

**హైదరాబాద్,జూలై15(సమయజ్యోతి):**

పండుగల సందడి మాటున జేబుదొంగలు ఆకతాయిలు తెగ రెచ్చిపోతుంటారు.. ఇటీవల హైదరాబాద్ లో మొహరం, బోనాల పండుగపూట ఆకతాయిలు రెచ్చిపోయారు. ఉత్సవాల సమయంలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ కొందరు పోకిరీలె షీ టీమ్స్ కి రెడ్ హ్యాండెడ్ దొరికిపోయారు. మొహరం, బోనాల పండుగ సీజన్ లో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన 478 మంది ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు– తెలిపారు షీ టీమ్స్ అధికారులు. వీరిలో ఎక్కువ మంది మైనర్లు, వృద్ధులే ఉన్నట్లు అధికారులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న 478 మందిలో 386 మంది మేజర్లు, 92 మంది మైనర్లు ఉన్నట్లు– తెలిపారు. వీరిలో 288 మందిని హెచ్చరించి కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశామని తెలిపారు. మిగిలినవారిలో ఐదురు మందికి జరిమానా విధించి, ఒకరికి జైలు శిక్ష విధించిందని తెలిపారు అధికారులు.

# స్త్రీజనోద్ధరణ పోరాట యోధురాలు

**కాకినాడ,జూలై15(సమయజ్యోతి):**

తన జీవితమంతా సమాజ సేవకు ముఖ్యంగా స్త్రీజనోద్ధరణకు అంకితం చేసిన స్ఫూర్తి ప్రదాత శ్రీమతి దుర్గా బాయి దేశ్‌ముఖ్. ఆంధ్రరాష్ట్రం గర్వించదగ్గ మహిళా మూర్తులో దుర్గాబాయిని అగ్రగణ్యులుగా చెప్పుకోవచ్చు. ఈమె దేశభక్తు రాలిగా, స్వాతంత్ర్య సమర యోధు రాలిగా, సంఘ సంస్కర్తగా, కార్య కర్తగా, రచయిత్రిగా... తన కాలంలో మరెవరూ చూపని ధైర్య సాహసాలను, ప్రజ్ఞను చూపి చరిత్రలో నిలిచిపోయారు. 1909 వ సంవత్సరం జూలై 15వ తేదీన కాకినాడలో కృష్ణవేణమ్మ, రామారావు దంపతులకు దుర్గాబాయి జన్మించారు. ఈమె బాల్యం నుండీ ప్రతిభాపాఠవాలను కనబరుస్తూ పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసులవారికీ విద్యాబోధన కావించేవారు.అందరూ మనిషులుగానే పుడతారు.. కానీ కొందరు మాత్రమే మహామనుషులుగా నిలుస్తారు. నేటి సమాజంలో వేనూళ్లుకున్న స్వార్థం.. నేను, నావాళ్లు.. అనే పదాలకు పూర్తి భిన్నంగా మేము మావాళ్లు అనే భావన తో సమాజం లో మార్పుకు.. సంఘ హితం కోసం చేసిన కార్య క్రమాలకు తమ సొంత డబ్బులు, అస్తులు కూడా అమ్మి నేటికి ఆ కార్య క్రమాలతో మానవ జాతిలో చిరస్థాయిగా తరతరాలుగా నిలిచిపోయిన వారే మహనీయులు. అలాంటి వారిలో దుర్గాబాయ్ దేశ్ ముఖ్ ఒకరు. ఆమె వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ, ఓ గొప్ప మహోన్నత శక్తి. మేధావిగా, న్యాయకోవిదు రాలుగా, మానవతావాదిగా, ఆంధ్రమహిళా సభ వ్యవస్థాపకురాలిగా.. బహుముఖ ప్రజ్ఞను కనబరిచి చరిత్రపుటల్లో మహా మనిషిగా కీర్తి సాధించారు. దుర్గాబాయి తన 11 సంవత్సరాల ప్రాయంలో ఖాదీ ప్రదర్శన జరుగుతున్న సమయంలో ఆమెను వాలంటీర్‌గా నియమించినపుడు ఆ ప్రదర్శనను తిలకించడానికి వచ్చిన పండిట్ నెహ్రూగారిని టికెట్ లేని కారణంగా అనుమ తించలేదు... బ్రిటిషు అధికా రులచే 'ఆడసింహం'గా అభివర్ణించబడ్డ ధీరవనితగా, తనను తాను సంఘానికి సమర్పించుకున్న పూజనీయ వ్యక్తిగా, చైతన్య సేవా స్రవంతిగా అందరినోటా కీర్తించబడ్డ దుర్గాబాయి... 1981 మే 9వ తేదీన హైదరాబాదులో పరమపదించారు.





## ఫార్వర్డ్స్ రాణించినా.. భారత ఏ జట్టుకు షాకిచ్చిన ఇంగ్లండ్

యూరప్ పర్యటనను విజయంతో ఆరంభించిన భారత హాకీ 'ఏ' జట్టు కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. మంగళవారం ఆద్యంతం ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో 2-3తో ఓటమి పాలైంది యంగ్ ఇండియా. ఫార్వర్డు ఆటగాళ్లు మణిందర్ సింగ్ , ఉత్తమ్ సింగ్ చెరో గోల్‌తో ప్రత్యర్థిని కంగారెత్తించారు. కానీ, ఆఖర్లో ఇంగ్లండ్ ప్లేయర్లు దూకుడుగా ఆడి నిర్ణయాత్మక గోల్ సాధించారు. దాంతో, యువ భారత జట్టుకు షాక్ తప్పలేదు.'యూరప్ పర్యటన ఆరంభంలో మేము మూడు అద్భుత విజయాలు సాధించాం. కానీ, వరుసగా రెండు ఓటములు ఎదురయ్యాయి. టోర్నీ జరుగుతున్న కొద్దీ మాకు కఠినమైన ప్రత్యర్థులు ఎదురవుతారనే విషయం మాకు తెలుసు. ఇకపై ఒక్కో మ్యాచ్ గెలవడంపై దృష్టి పెడుతాం. తదుపరి మూడు మ్యాచులు ఆడాల్సి ఉంది. రెండు బలమైన జట్లను ఢీకొనబోతున్నాం' అని ఇంగ్లండ్‌పై ఓటమి అనంతరం కోచ్ శివేంద్ర సింగ్ వెల్లడించాడు. గురువారం బెల్జియంతో, జూలై 18న నెదర్లాండ్స్‌తో భారత ఏ జట్టు తలపడనుంది.

## మూడో టెస్టులో ఓటమికి కారణాలేంటో చెప్పిన శుభ్‌మన్ గిల్.. పంత్ గాయం, బుమ్రాపై కీలక అప్‌డేట్ ఇచ్చిన కెప్టెన్..!

భారత్-ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచుల టెస్ట్ సిరీస్‌లో లార్డ్స్ టెస్టులో ఆతిథ్య జట్టు 22 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో ఇంగ్లండ్ 1-2 ఆధిక్యంలో నిలిచింది. ఈ మ్యాచ్ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఓటమికి కారణాలు తెలిపాడు. చివరి రోజు విజయంపై తనకు నమ్మకం ఉందని.. అయితే, విజయానికి పెద్ద భాగస్వామ్యం నెలకొల్పాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు. ఈ సందర్భంగా వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ గాయంపై అప్‌డేట్ ఇచ్చాడు. గిల్ జట్టు ప్రదర్శనపై హర్షం వ్యక్తం చేశాడు. ప్రదర్శన చూస్తే చాలా గర్వగా ఉందని చెప్పుకొచ్చాడు. 'మ్యాచ్‌లో విజయం సాధిస్తామని చాలా నమ్మకంగా ఉన్నాం. ఎందుకంటే ఎందుకంటే కీలకమైన బ్యాట్స్‌మెన్ ఉన్నారు. టాప్ ఆర్డర్‌లో కొన్ని మంచి భాగస్వామ్యాలు అవసరం. కానీ, మేం అలా చేయలేకపోయాం. మా కంటే ఇంగ్లండ్ మెరుగైన ప్రదర్శన ఇచ్చింది. లక్ష్యం పెద్దదేమీ కాదు. మ్యాచ్‌లో భాగస్వామ్యం కీలకం. రవీంద్ర జడేజా చాలా సీనియర్ ప్లేయర్. అతనికి ఎలాంటి సూచనలు ఇవ్వలేదు. అతను టెయిల్ ఎండ్ బ్యాట్స్‌మెన్ ఆడుతూనే ఉండాలని కోరుకున్నాడు' అంటూ చెప్పుకొచ్చాడు.రవీంద్ర జడేజా ఒంటరి పోరాటం..లార్డ్స్ టెస్టులో టీమిండియా లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 82 పరుగులకు ఏడు వికెట్లు కోల్పోయింది. కానీ, రవీంద్ర జడేజా 181 బంతులు ఎదుర్కొని నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఎనిమిదో వికెట్‌కు నితీశ్ రెడ్డి (13)తో కలిసి 91 బంతుల్లో 30 పరుగులు, జస్ప్రీత్ బుమ్రా (05)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 132 బంతుల్లో 35 పరుగులు, సిరాజ్‌తో కలిసి చివరి వికెట్‌కు 80 బంతుల్లో 23 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి టీమిండియాకు విజయంపై ఆశలు రేకెత్తించాడు. కానీ, ఓ వైపు ఒంటరి పోరాటం చేసినా జట్టును ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు.

### పంత్, బుమ్రాపై కీలక అప్‌డేట్..

వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ మాంచెస్టర్ టెస్టులో ఆడుతాడని గిల్ తెలిపాడు. స్కాన్‌లో పంత్ వేలికి ఎలాంటి పెద్ద గాయం కాలేదని తేలిందని.. నాలుగో టెస్ట్ వరకు ఫిట్‌గా ఉంటాయని పేర్కొన్నారు. మూడో టెస్ట్ తొలి రోజు రెండవ సెషన్‌లో పంత్ ఎడమ చూపుడు వేలుకు గాయం కావడంతో మైదానం విడిచి వెళ్లాల్సి వచ్చింది. గిల్ మాట్లాడుతూ పంత్ స్కానింగ్ కోసం వెళ్లాడు. అతనికి పెద్దగా గాయం కాలేదు. కాబట్టి మాంచెస్టర్ మ్యాచ్ వరకు సిద్ధమవుతాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. నాలుగో టెస్ట్‌కు జస్ప్రీత్ బుమ్రా అందుబాటులో ఉంటాడా? అని ప్రశ్నించగా.. సమాధానం ఇవ్వలేదు. త్వరలోనే ఈ విషయం గురించి తెలుసుకుంటారు' అని గిల్ తెలిపాడు.



## చరిత్రపుటల్లో ఒకమ్యాచ్..

### లార్డ్స్‌లో ఇంగ్లండ్ కాదు టెస్టు క్రికెట్ గెలిచింది..!

పొట్టి క్రికెట్ వేళ్లూనుకుంటున్న ఈ కాలంలో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌కు జీవం పోసింది ఐసీసీ. డబ్ల్యూటీసీ సీజన్ ఏమంట మొదలైందో రెడ్ బాల్ క్రికెట్ కొత్త రూపు సంతరించుకుంది. టెస్టు గద పోరుకు అర్హత సాధించేందుకును అన్ని జట్లు హెూరాహెూరీగా తలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో చరిత్రపుటల్లో నిలిచిపోయే మ్యాచ్‌కు ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానం వేదికైంది.అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో ఒకటైన మూడో టెస్టులో భారత్, ఇంగ్లండ్‌లు 'నువ్వానేనా' అన్నట్లు తలపడగా.. చివరకు ఆతిథ్య జట్టునే అదృష్టం వరించింది. మరీ ముఖ్యంగా ఐదో రోజు ఆట హైలెట్. ఓవైపు వికెట్లు పడుతున్నా.. టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అలుపెరగని యోధుడిలా పోరాడిన తీరు అందర్నీ కట్టిపడేసింది. స్టేడియంలోని వీక్షకులను, కామెంటేటర్లను, టీవీలకు అతుక్కుపోయినవాళ్లను ఆద్యంతం మునివేళ్లపై నిలబెట్టి కడకు కన్నీళ్లను మిగిల్చిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలుపొందినా.. అసలైన విజేత టెస్టు క్రికెట్ అంటున్నారు మాజీ ఆటగాళ్లు. అవును.. నిజమేగా.



## బెంగళూరులో టీమిండియా వామప్ మ్యాచ్‌లు.. పాకిస్థాన్ జట్టు ఎక్కడ ఆడనుందంటే..!

మహిళల వన్డే వరల్డ్ కప్ 2025 సన్నద్ధతలో భాగంగా భారత జట్టు రెండు వామప్ మ్యాచ్‌లు ఆడనుంది. పుష్కర కాలం తర్వాత ఉపఖండంలో జరగనున్న ఈ మెగా టోర్నీలో పటిష్టమైన ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్లతో టీమిండియా తలపడనుంది. చిన్నస్వామి స్టేడియంలో సెప్టెంబర్ 25న ఇంగ్లండ్‌ను, 27న కివీస్‌ను హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఢీకొననుంది. మంగళవారం అంతర్జాతీయ క్రికెట్ మండలి వరల్డ్ కప్ వామప్ మ్యాచ్‌ల వేదికలను, తేదీలను ప్రకటించింది.

ఆనవాయితీ ప్రకారం ప్రపంచ కప్ సంసిద్ధతగా భావించే ఈ మ్యాచ్‌లను బెంగళూరు, శ్రీలంకలోని కొలంబో మైదానంలో జరపాలని ఐసీసీ తీర్మానించింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు కొలంబోలో ఆడుతాయని తెలిపింది. పన్నెండేళ్ల తర్వాత మహిళల వన్డే వరల్డ్ కప్ పోటీలకు ఉపఖండం ఆతిథ్యమిస్తోంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించే ఈ టోర్నీ సెప్టెంబర్ 30న షురూ కానుంది. నవంబర్ 12న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో టైటిల్ విజేత ఎవరో తేలిపోనుంది.




## లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్.. జూలై 20, 29 తేదీల్లో మెడల్ మ్యాచ్‌లు

లాస్ ఏంజిల్స్: 2028లో లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే ఆ మెగా ఈవెంట్‌కు చెందిన క్రికెట్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ప్రకటించారు. లాస్ ఏంజిల్స్‌కు 50 కిలోమీటర్ల దూరంలో పొమినా సిటీలో ఉన్న ఫెయిర్‌గ్రౌండ్స్ స్టేడియంలో తొలి మ్యాచ్ ఆడనున్నారు. 2028, జూలై 12వ తేదీన క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభంకానున్నాయి. జూలై 20, 29వ తేదీల్లో మెడల్ మ్యాచ్‌లు ఉంటాయని ఒలింపిక్స్ కమిటీ తెలిపింది. టీ20 ఫార్మాట్‌లో ఒలింపిక్స్ క్రికెట్ నిర్వహించనున్న విషయం తెలిసిందే.మహిళలు, పురుషుల విభాగాల్లో మొత్తం ఆరు జట్లు క్రికెట్ మెడల్ కోసం పోటీపడనున్నాయి. మొత్తం 180 మంది క్రికెటర్లు గేమ్స్‌కు రానున్నారు. 1900 సంవత్సరంలో జరిగిన ఒలింపిక్స్‌లో చివరిసారి క్రికెట్‌ను నిర్వహించారు. ఆ తర్వాత మళ్లీ ఎప్పుడూ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు స్థానం కల్పించలేదు. జూలై 14, 21 తేదీల్లో క్రికెట్ మ్యాచ్‌లు ఉండవు. 1900లో జరిగిన క్రికెట్ టోర్నీలో కేవలం రెండు జట్లు మాత్రమే పోటీపడ్డాయి. మెడల్ కోసం బ్రిటన్, ఫ్రాన్స్ పోటీపడ్డాయి. లాస్ ఏంజిల్స్‌లో పాల్గొనే 12 జట్లలో.. ఒక్కొక్క జట్టుకు 15 మంది సభ్యులను ఎంపిక చేసే అవకాశం కల్పించారు.

## హరిహరవీరమల్లు పార్-2

# మరింత పవర్‌ఫుల్

### ప్రమోషన్లలో పాల్గొంటున్న నిధి అగర్వాల్

**పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా రూపొందిన చారిత్రక నేపథ్యం ఉన్న చిత్రం 'హరి హర వీరమల్లు'జులై 24న గ్రాండ్ రిలీజ్ కానుంది. అయితే ఈ మూవీ ప్రమోషన్స్‌లో పవన్ అంత యాక్టివ్‌గా పాల్గొనడం లేదు. దర్శకుడు క్రిష్ మిడ్‌స్టేజ్‌లో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పకున్న నేపథ్యంలో ఆయన కూడా ప్రమోషన్ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. జ్యోతికృష్ణ ప్రస్తుతం ప్రమోషన్స్‌లో యాక్టివ్‌గా ఉన్నప్పటికీ తెలుగు ప్రేక్షకుల్లో ఆయనకు గుర్తింపు తక్కువగా ఉండడంతో పెద్దగా బజ్ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మొత్తం ప్రమోషన్ బరువు బాధ్యతలు నిధి అగర్వాల్ భుజాలపై పడింది. పంచమి పాత్రలో మెప్పిస్తున్న నిధి, గత రెండు మూడు సంవత్సరాలుగా ఈ సినిమాపై భారీ నమ్మకంతో ఎదురుచూస్తోంది. ఈ సినిమాతో ఆమె రేంజ్ మారుతుందని ఫ్యాన్స్ కూడా భావిస్తున్నారు. ఇక సినిమాకి సంబంధించిన ప్రతి ప్రమోషన్ కార్యక్రమంలో నిధి యాక్టివ్‌గా పాల్గొంటుంది. తాజాగా ఓ మీడియా ఇంటర్వ్యూలో పాల్గొన్న నిధి అగర్వాల్, 'హరి హర వీరమల్లు'తో పాటు- పార్ట్ 2 గురించి కూడా కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించింది. మొదట సినిమాను ఒకే పార్ట్‌గా రూపొందించాలనుకున్నప్పటికీ, కథ విస్తృతంగా ఉండటంతో రెండు భాగాలుగా చేయాలని నిర్ణయించారని తెలిపింది. ఇప్పటికే పార్ట్ 2కి సంబంధించిన 20 నిమిషాల సీన్స్ షూట్ పూర్తయ్యాయని చెప్పి అభిమానులని ఆనందింపజేసింది. నిధి చెప్పిన ప్రకారం, వీరమల్లు పార్ట్ 2లో కూడా ఆమె కీలక పాత్రలో కనిపించనుంది. అలాగే, రెండో భాగం మరింత పవర్‌ఫుల్‌గా ఉంటుందని తెలియజేసింది. అయితే షూటింగ్ మిగతా భాగం ఎప్పుడవుతుందనేది మాత్రం ఇంకా స్పష్టత లేదు. పవన్ రాజకీయాల్లో బిజీగా ఉన్న నేపథ్యంలో పార్ట్ 1 హిట్ అయితేనే పార్ట్ 2పై క్లారిటీ- వచ్చే అవకాశం ఉంది.ఏఎం రత్నం నిర్మాణంలో, క్రిష్ మరియు జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.**





# ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ పౌరాణిక చిత్రం

### ఆసక్తికర విషయాలు వెల్లడించిన నాగవంశీ




యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినీ కెరీర్‌లో దూసుకుపోతున్నాడు. గతేడాది దేవర సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తారక్ మరికొన్ని రోజుల్లో వార్ 2 చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమాతో బాలీవుడ్ మార్కెట్‌లోనూ తన సత్తా చాటనున్నాడు. హృతిక్ రోషన్‌తో కలిసి చేస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ ఆగష్టు 15న విడుదల కానుండగా, అభిమానులు సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇదే కాకుండా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్-టైనర్ ఒకటి చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుడగా.. దీనికోసం ఎన్టీఆర్ బరువు కూడా చాలా తగ్గాడు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ శ్రీనివాస్ ఒక సినిమా చేయబోతున్నట్లు- వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. మైథాలాజికల్ మూవీగా రానున్న ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మించబోతున్నాడు. సుబ్రహ్మణ్య స్వామి కథ ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్ విషయాల గురించి పంచుకున్నాడు నాగవంశీ. త్రివిక్రమ్ మొదటిసారి మైథలాజికల్ సినిమా చేస్తున్నారు. అందుకే ఈ సినిమాను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నాం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది మధ్యలో ఈ సినిమా లాంఛింగ్‌తో పాటు శరవేగంగా షూటింగ్ ఉంటుంది. త్రివిక్రమ్- వెంకటేశ్ సినిమా ఆగస్టు నుంచి ఈ సినిమా ప్రారంభం అవుతుంది. ఇది పూర్తయిన తర్వాతే ఎన్టీఆర్ ప్రాజెక్ట్ మొదలవుతుందని తెలిపాడు. త్రివిక్రమ్- ఎన్టీఆర్ సినిమా ప్రకటించడానికి భారీ స్థాయిలో ప్లాన్ చేశాం. త్రివిక్రమ్ మొదటిసారి మైథలాజికల్ సినిమా తీస్తున్నారు. సీనియర్ ఎన్టీఆర్‌ను రాముడిగా, కృష్ణుడిగా చూశాం. ఇప్పుడు తారక్‌ను నేను అలా చూపించనున్నాను. 'రామాయణ'ను ప్రకటించిన తర్వాత దేశమంతా దాని గురించి మాట్లాడుకుంది. దానికంటే భారీగా మా సినిమాను ప్రకటించాలని కొన్ని రోజులు ఆపాం. ఇప్పుడు ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది మధ్యలో దీన్ని ప్రారంభించాలని అనుకుంటున్నాం. త్రివిక్రమ్- వెంకటేశ్ సినిమా ఆగస్టు నుంచి ప్రారంభం అవుతుంది. ఇది పూర్తయిన తర్వాత దీని పనులు మొదలవుతాయని నాగవంశీ చెప్పారు. ఇక విజయ్ దేవరకొండను ప్రేక్షకులు ఎందుకు టార్గెట్ చేస్తారో కూడా తెలియదని నాగవంశీ అన్నారు. ఆయన ప్రస్తుతం తన సినిమాలు ప్రేక్షకాదరణను సొంతం చేసుకోలేకపోతున్నాయని బాధ పడుతున్నట్లు- చెప్పారు. ఆయన ఏం మాట్లాడినా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని అన్నారు.

# రామాయణ బడ్జెట్ నాలువేల కోట్లు

### సంచలన వివరాలు వెల్లడించిన నిర్మాత

బాలీవుడ్ డైరెక్టర్ నితీశ్ తివారీ రామాయణాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్న విషయం తెలిసిందే. 'రామాయణ' పేరుతో ప్రతిష్ఠాత్మకంగా ఇది రూపొందుతోంది. తాజాగా దీని బడ్జెట్‌ను నిర్మాత నమిత్ మల్హోత్రా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఏకంగా రూ.4000 కోట్లతో దీన్ని నిర్మించనున్నట్లు- చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఇప్పటివరకూ ఇంత భారీ బడ్జెట్‌తో భారతీయ సినిమాలు తెరకెక్కలేదన్న నమిత్ 'రామాయణ' చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉందన్నారు. మేం ఈ సినిమా కోసం నిధులు సమకూర్చుకుంటున్నాం. ఎవరి దగ్గరా డబ్బులు తీసుకోవాలని అనుకోవడం లేదు. ఏడు సంవత్సరాల క్రితమే మేం దీని పనులు ప్రారంభించాం. కొవిడ్ తర్వాత దీన్ని ప్రారంభించినప్పుడు ప్రజలు నన్ను పిచ్చివాడిని అనుకున్నారు. ఏ భారతీయ సినిమా కూడా 'రామాయణ' దరిదాపుల్లోకి రాలేదు. రెండు భాగాలు రానున్న ఈ చిత్రాన్ని సుమారు రూ.4000 కోట్లతో రూపొందించనున్నాం. ప్రపంచమంతా ఈ ఇతిహాసాన్ని చూడాలన్న లక్ష్యంతోనే దీన్ని భారీ స్థాయిలో రూపొందిస్తున్నాం. హాలీవుడ్ చిత్రాలకు అయ్యే ఖర్చు కంటే ఇది తక్కువే అని నేను భావిస్తున్నాను. తరాలు మారినా, యుగాలు మారినా రామాయణం ఎప్పటికీ గొప్ప ఇతిహాసమే అని నిర్మాత తెలిపారు. భారతీయ సినిమాపై ప్రపంచం చిన్నచూపు చూసినప్పుడు తాను నిరాశకు గురవుతానన్నారు నమిత్ మల్హోత్రా. 'రామాయణ' ప్రాజెక్ట్‌తో ప్రపంచమంతా భారత్ వైపు చూస్తుందన్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రానున్న ఈ సినిమా బడ్జెట్‌పై ఎన్నో ఊహాగానాలు వచ్చాయి. రూ.835 కోట్లతో రానుందని టాక్ వినిపించింది. తర్వాత రూ.1600 కోట్లని.. మొదటిభాగం రూ.900 కోట్లతో రానుందని.. రెండోది రూ.700 కోట్లని కథనాలు వెలువడ్డాయి. ఇప్పుడు వాటన్నిటికీ చెక్ పెడుతూ నిర్మాతే అధికారికంగా దీని బడ్జెట్‌ను రివీల్ చేయడం వైరల్‌గా మారింది. ఇక ఇందులో ఈ చిత్రంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి , రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ 2026 దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్న విషయం తెలిసిందే.




EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685